ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.20 (298.0120)	1,98,913	1,98,913
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.93 (3.92)	389.29	652.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.783 (40.913)	1,47,362	1,35,023

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.230



యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పాదన యూనిట్లతో పాటు ఇతర మౌలిక వనరుల కల్పనకు జెన్‌కో లక్ష్యాలను నిర్దేశించుకొని పనుల్లో వేగం పెంచింది. ఈ నెల 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ పనుల పురోగతిని సమీక్షించారు. బొగ్గు రవాణాకు అవసరమైన రైల్వే లైన్లు, రోడ్లు, టౌన్‌షిప్ నిర్మాణంతో పాటు, కీలకమైన ఫ్లైయాష్ విక్రయం, రవాణాకు అవసరమైన పనులన్నింటికీ గడువు విధించారు. 2027 నవంబరు నాటికి ఈ పనులన్నింటినీ వందశాతం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు జెన్‌కో డైరెక్టర్ హరీష్ తెలిపారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

శరవేగంగా పనులు

- థర్మల్ పవర్ ప్లాంట్‌లో మౌలిక వసతుల కల్పన
- నవంబరు నెలాఖరుకు రైల్వే పనుల పూర్తికి చర్యలు
- ఫ్లైయాష్ విక్రయంపై స్పష్టమైన కార్యాచరణ
- ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ 2027 నాటికి అందుబాటులోకి..
- జాతీయ రహదారి నుంచి ప్లాంట్‌కు ఫోర్‌వే నిర్మాణం

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కీలకమైన రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా ప్లాంట్ పనులకు సమాంతరంగా కొనసాగుతున్నాయి. థర్మల్ ప్లాం ట్‌కు ఏడాదికి 12.29 మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరం. సగటున నెలకు ఒక మిలియన్ యూనిట్ల బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. అందుకోసం ప్లాంటు వద్దకు విష్ణుపురం నుంచి ప్రత్యేకంగా రైల్వే లైన్ ఏర్పాటుచేశారు. ప్లాంట్ వద్ద మార్షలింగ్‌యార్డు, ఎక్స్‌చేంజ్‌యార్డుల్లో కొన్ని పనులు పూర్తవగా, మరికొన్ని చివరిదశలో ఉన్నాయి. ప్లాంట్‌లో నిర్మాణం చేపట్టిన రైల్వే యార్డుల పనులు, వాటికి అనుసంధానంగా ఉండే సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ పనులను, మార్షలింగ్‌యార్డ్‌లో మిగిలిన ఆరులేన్ల పనులతో పాటు, ఎక్స్‌చేంజ్ యార్డులో లేన్ల పనులు, సిగ్నలింగ్ విభాగంలో రెండో దశ కింద చేపట్టిన పనులన్నింటినీ ఈ ఏడాది నవంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లకు మార్గనిర్దేశం చేశారు. వీటితోపాటు కీలకమైన విష్ణుపురం జంక్షన్-వైటీపీఎస్ మార్గంలోని వైలైన్ రైల్వే పనులు దాదాపు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి రెండు వంతెనల వద్ద వింగ్‌వాల్స్, కేబుల్స్ షిఫ్టింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ షిఫ్టింగ్ నిమిత్తం నిధులు సైతం రైల్వేశాఖకు జెన్‌కో డిపాజిట్ చేయగా, ఆ పనులను దక్షిణమధ్య రైల్వే పూర్తిచేయాల్సి ఉంది. ఇవి పూర్తయితే వై-లైన్ అందుబాటులోకి వస్తుంది. ఈ వై-లైన్‌కు రైల్వేశాఖ అనుమతి ఇస్తే పవర్‌ప్లాంట్‌కు సంబంధించిన రైల్వే పనులన్నీ పూర్తయినట్లే. దీనిపై జెన్‌కో ఉన్నతాధికారులు త్వరలో రైల్వే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, పనుల పూర్తికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ 2027కు సిద్ధం

పవర్‌ప్లాంట్ మారుమూల ప్రాంతంలో ఉండటంతో ఇక్కడ పనిచేసే ఇంజనీర్లు, అధికారులు, సిబ్బందికి చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో నివాస సముదాయాలు, ఇతర మౌలిక వసతులు కల్పించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనప్పటికీ రూ.971.98కోట్లతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ మంజూరు చేసి పనులు ప్రారంభించామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం సమీక్షలో పేర్కొన్నారు. 67 ఎకరాల ప్రాంగణంలో నిర్మిస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను 2027 నవంబరు నాటికి అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ టౌన్‌షిప్‌లో రెసిడెన్షియల్ విభాగంలో 2,078 క్వార్టర్ల కోసం ఐదు అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. నాన్ రెసిడెన్షియల్ విభాగంలో ఆస్పత్రి, పాఠశాల, స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్లబ్ హౌస్, సూపర్‌మార్కెట్, కమ్యూనిటీ హాల్ తదితర నిర్మాణాలు చేపడతారు. టౌన్‌షిప్ పనులకు డిప్యూటీ సీఎం శుక్రవారం భూమి పూజ చేశారు. ఏ-కాలనీలో రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణాలకు సంబంధించి టెండర్లు ఖరారు చేసి పనులు ఇప్పటికే ప్రారంభించగా, బీ-కాలనీ పనులు ప్రారంభించనున్నారు. బీ-కాలనీకి...

- మిగతా 8వ పేజీలో...


టౌన్‌షిప్‌నకు భూమి పూజలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క (ఫైల్)

పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం

స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యాల వారీగా ఖాళీల ప్రదర్శన

జిల్లాలో పదోన్నతులతో భర్తీ కానున్న 229 పోస్టులు



నల్లగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారంగా స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల పదోన్నతుల్లో భాగంగా శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లల్లో అర్హులైన టీచర్ల సర్వీస్ బుక్‌లను, సర్టిఫికెట్లను పరిశీలించారు. వివిధ కౌంటర్లల్లో స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యాల వారీగా ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా సీనియారిటీల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉన్నవారి నుంచి దరఖాస్తులు తీసుకొని సందేహాలను నివృత్తి చేశారు. ఈనెల 4న స్థానిక సంస్థల యాజమాన్య పరిధిలోని ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. మ్యాథ్స్, ఇంగ్లీష్, బయోసైన్స్, సోషల్, పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల పరిశీలనకు ఇప్పటికే జిల్లా విద్యాశాఖ సమాచారం అందింది. జిల్లాలో మొత్తం 229 పోస్టులు పదోన్నతులతో భర్తీకానున్నాయి. ఎస్‌ఏ మ్యాథ్స్ 11 పోస్టులు, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ 11 (తెలుగు మీడియం), ఇంగ్లీష్ మీడియంలో ఒక పోస్టు, ఎస్‌ఏ బయోసైన్స్ 29, ఎస్‌ఏ సోషల్ 30, ఎస్‌ఏ ఇంగ్లీష్ 17, ఎస్‌ఏ తెలుగు 25, ఎస్‌ఏ హిందీ 21, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 7, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ 13, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం 40, ఉర్దూ మీడియంలో ఒక పోస్టు భర్తీ చేయనున్నారు. అలాగే ఎస్‌ఏ ఉర్దూ మీడియం ఒకటి, ప్రభుత్వ యజమాన్యంలో ఎస్‌ఏ మ్యాథ్స్ ఒకటి, ఉర్దూ మీడియంలో ఒకటి, ఎస్‌ఐ బయోసైన్స్ రెండు, ఎస్‌ఏ సోషల్, ఎస్‌ఏ సోషల్ (ఉర్దూ మీడియం)లో ఒక పోస్టు చొప్పున, ఎస్‌ఏ ఇంగ్లీష్ రెండు, ఎస్‌ఏ తెలుగు ఆరు, ఎస్‌ఏ హిందీ ఐదు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు మూడింటిని పదోన్నతులతో భర్తీ చేయనున్నారు. ఒక్కో పోస్టుకు 1:3 ప్రకారంగా ఉపాధ్యాయుల తాత్కలిక సీనియారిటీ జాబితాను రూపొందించి సర్వీస్ బుక్‌ను, అర్హత సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన వారితో పదోన్నతుల జాబితాను విడుదల చేస్తారు. స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించేందుకు స్థానిక సంస్థల యాజమాన్యం పరిధిలోని 47 పోస్టులకు 1:3 ప్రకారంగా ఉపాధ్యాయుల తాత్కాలిక జాబితాను రూపొందించి సర్టిఫికెట్లను పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తిచేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, హాలియా మునిసిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 3,462 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశామన్నారు. అందులో 538 ఇళ్లు పునాది స్థాయిలో, 18 స్లాబ్ లెవల్, ఆరు స్లాబ్ వరకు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణంలో సరైన పురోగతి లేనందున వాటిని వెంటనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 136 మంది లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకునే స్థోమత లేనివారిగా గుర్తించామని, వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని ఏపీఎంలను ఆదేశించారు. ఈనెల 10లోపు ఇళ్ల నిర్మాణాల్లో 50శాతం పురోగతి సాధించాలన్నారు. వివిధ స్థాయిల్లో నిర్మాణాలు పూర్తిచేసిన వారికి ప్రతీ సోమవారం బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయాన్ని తనిఖీచేసి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో వంటగది, స్టోర్‌రూమ్, పాఠశాల పరిసరాలను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి ఓపీ రిజిస్టర్, ఏఎన్‌సీ, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పెద్దవూర ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ శ్రీనివా‌స్‌రావు, తదితరులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ చూపాలి

సర్వశిక్ష అభియాన్ అదనపు డైరెక్టర్ సోమిరెడ్డి


పాఠశాల పరిసరాలను ఉపాధ్యాయులతో కలిసి పరిశీలిస్తున్న సోమిరెడ్డి

వేములపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అడ్మిషన్ పొందిన ప్రతీ విద్యార్థి ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సర్వశిక్ష అభియాన్ అదనపు డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆమనగల్లు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. విద్యలో సాంకేతికతను జోడి స్తూ బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని సూచించారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణం లో వండాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు బి.యోగేశ్వర్, ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.


నాలుగు లక్షల ఇళ్లలో జ్వర సర్వే నిర్వహిస్తాం

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మర్రిగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4.25లక్షల ఇళ్లలో జ్వర సర్వే నిర్వహిస్తామని, డెంగీ, మలేరియా ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా దామర భీమనపల్లి ఉపకేంద్రం పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన యూఐపీ సెషన్ సైట్‌ను సందర్శించి స్టోర్లను పరిశీలించారు. గర్భిణులకు ప్రసవ అనంతరం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి, అంగన్వాడీ కేంద్రంలో టీకాలు తీసుకున్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. డయాలసిస్ సెంటర్‌ను, వందరోజుల టీబీ ముక్త్ అభియాన్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 4.25లక్షల గృహల్లో జ్వర సర్వే నిర్వహించడం లక్ష్యమన్నారు. ఇప్పటికే సిబ్బంది సర్వేను ప్రారంభించారని తెలిపారు. సిబ్బంది ఇంటింటికీ తిరి జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లో వ్యక్తిగత, సామాజిక పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కే.రవి, వైద్యాధికారి శంకర్‌నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శాలిని, డాక్టర్ దీపక్ ఉన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండరూరల్, ఆగస్టు 2 (ఆం ధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, అందరికి కనీస వేతనాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ హామీని నెరవేర్చలేదన్నారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాలను తక్కువగా సవరించి 1.20కోట్ల మం ది కార్మికులకు ద్రోహం చేశారని విమర్శించారు. కార్మికుల సమస్యల పై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు ఈ నెల 3 నుంచి 28వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామన్నారు. 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు డబ్బికార్ మల్లేష్, ఎండి.సలీం, సైదయ్య, ప్రమీల, దండంపల్లి సత్తయ్య, వెంకటయ్య, గౌతంరెడ్డి, పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు దూరంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని, బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని కోరుతూ డీవైఎఫ్ఐ చేపట్టిన యువచైతన్య సైకిల్ యాత్ర శనివారం మిర్యాలగూడలో ముగిసింది. ముగింపు సభలో డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పాల్గొని మాట్లాడారు. సరదా కోసం, చెడు స్నేహాల వల్ల మత్తుకు అలవాటు పడి ఉన్నత భవిష్యత్‌కు యువత దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడితే తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితికి వెళ్లి ఎలాంటి దుర్మార్గాలకైనా వెనుకాడక వారితో కుటుంబాన్ని, సమాజాన్ని పెడమార్గంలోకి తీసుపోతారన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ ముప్పారామారావు, సామాజికవేత్త మునీర్, సీపీఎం జిల్లా నాయకులు వినోద్ నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు రెమిడాల పరుశరాములు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లం మహేశ్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, డీవైఎఫ్ఐ నాయకులు పతాని శ్రీనివాస్, పల్లా భిక్షం, వదూద్, శ్రీనునాయక్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ముగిసిన యువ చైతన్య సైకిల్ యాత్ర

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్ యాత్ర శనివారం ముగిసింది. డ్రగ్స్‌ను అరికట్టాలని, బెట్టింగ్ వ్యాపారాలను నిషేధించాలని జిల్లాలో చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతంగా ముగిసింది. గత నెల 24న నకిరేకల్ నుంచి ప్రారంభమైన యాత్ర ఆరు మున్సిపాలిటీలు, 25 మండలాల్లోని అనేక గ్రామాల్లో యాత్ర కొనసాగింది. సుమారు 450 కిలోమీటర్లు యాత్ర నిర్వహించారు. సైకిల్ యాత్రలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్ల మహేశ్, పుల్లెంల శ్రీకర్, మహేశ్, గుండాల నరేశ్, కట్టలింగస్వామి, గద్దపాటి సుధాకర్, శశిధర్, బొడ్డుపల్లి నరేశ్, రాజేష్, సాయితేజలు పాల్గొన్నారు.

శ్రీలత కుటుంబానికి న్యాయ సాయం అందిస్తా

సీనియర్ న్యాయవాది దర్శనం నర్సింహ


శ్రీలత చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న న్యాయవాది నర్సింహ

కనగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఇటీవల ప్రేమికుడి చేతిలో హత్యకు గురైన కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన దళిత యువతి,నర్సు సిరిపంగి శ్రీలత కుటుంబానికి ఉచితంగా న్యాయ సాయం అందిస్తానని సీనియర్ న్యాయవాది దర్శనం నర్సింహ తెలిపారు. శనివారం శ్రీలత తల్లిదండ్రులైన కాశయ్య, రేణుకలను మండలంలోని దోరెపల్లి గ్రామంలో కలిసి పరామర్శించారు. శ్రీలత చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ దళితుల మీద జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను ప్రతీఒక్కరు ఖండించాలన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు,ఆర్ఎంపీ వైద్యుడు చిత్రం స్వామి, దళిత సంఘాల నాయకులు శంకర్, వంశీ, వినోద్, సుధాకర్, రమేష్ తదితరులున్నారు.

కల్లుగీత కార్మికులకు ‘రక్షణ’

- ప్రమాదాలు నుంచి రక్షించేందుకు కాటమయ్య రక్షణ సామగ్రి
- సామగ్రితో తగ్గిన ప్రమాదాలు

6

నార్కట్‌పల్లి పెద్దచెర్వుకు మహర్దశ

చురుకుగా సాగుతున్న సొరంగం తవ్వకం పనులు



డిండి ఎత్తిపోతలలో భాగంగా నిర్మిస్తున్న మెయిన్‌కెనాల్ సొరంగం అవుట్‌లెట్

డిండి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా డిండి ఎత్తిపోతలలో భాగంగా చేపట్టిన సొరంగం నిర్మాణం(టన్నెల్) పనులు చురుకుగా సాగుతున్నాయి. ఎత్తిపోతల మెయిన్‌కెనాల్ 22.150 కిలోమీటర్ నుంచి 23.325 వరకు చేపట్టిన సొరంగం 1.155 కిలోమీటర్లు పూర్తయిందని నీటిపారుదలశాఖ డీఈ మనోహర్ శనివారం తెలిపారు. మరో 80 మీటర్లు సొరంగం తవ్వకం చేపట్టాల్సి ఉందన్నారు. 80మీటర్ల డయ(వ్యాసార్థం)తో చేపట్టిన టన్నెల్ నిర్మాణం పనులు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో చురుకుగా సాగుతున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి నుంచి నల్లగొండ జిల్లా డిండి మండలంలోని వీరబోయినపల్లి వరకు సొరంగం ఉంటుంది. ఇదే మెయిన్‌కెనాల్‌పై మరోచోట 550 మీటర్లు టన్నెల్ తీయాల్సి ఉండగా దీనికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. టన్నెల్ నిర్మాణం రైతుల వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు.

రెండు రోజులు ఇంటింటికీ బీజేపీ

నల్లగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ స్థానిక సంస్థల జిల్లా ఎన్నికల కన్వీనర్ వీరెల్లి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ బూత్‌లోని ప్రతి ఇంటికీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రజలను పలకరించాలని, మోదీ ప్రభుత్వ విజయాలు సాధించిన ప్రగతిపై అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. గ్రామ సౌభాగ్యం బీజేపీతోనే సాధ్యమనేది ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. రైతులకు అండగా బీజేపీ ఉంటుందని యువత భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు.

నల్లగొండలో మత్తు ఇచ్చి అత్యాచారం?

నల్లగొండ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినట్లు నల్లగొండ జిల్లా కేంద్రంలో చర్చ సాగుతోంది. ఈ సంఘటనపై సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన వ్యక్తులు సదరు యువతికి మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఆ యువతి మత్తు దిగాక ఇంటికి వెళ్దామని బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఆమె స్పృహ తప్పిపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీ సిబ్బంది కొందరూ 108 వాహనానికి సమాచారమిచ్చి యువతిని ప్రభుత్వాస్పత్రికి పంపించినట్లు సమాచారం. అత్యాచారం చేసిన వారిని రక్షించడం కోసం కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ సైదులును వివరణ కోరగా అలాంటి సంఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, ఎవరు ఫిర్యాదు కూడా చేయలేదని తెలిపారు.

మోసం చేసిన వారిపై కేసు నమోదు

వలిగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉద్దేశపూర్వకంగా మోసం చేసిన వారిపై శనివారం కేసు నమోదు చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం సంగెం గ్రామంలో ఈ వేసవికాలంలో వలిగొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులు పన్నాల ఉషారాణి, ట్యాబ్ అపరేటర్ పబ్బతి శేఖర్, అసిస్టెంట్ కాసుల బాలకిషన్ ధాన్యాన్ని సేకరించారు. మే 8న పన్నాల శేఖర్‌రెడ్డి నుంచి 1,034 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి రిజిస్టర్‌లో 1,534 బస్తాలుగా నమోదు చేశారు. అదనంగా 500 బస్తాలను కాసుల పద్మకు జమచేశారు. ఆ ధాన్యాన్ని స్థానిక రైస్‌మిల్లుకు తరలించారు. ఉద్దేశపూర్వకంగా ధాన్యం కొనుగోలు వ్యవస్థను తీసేందుకు ప్రయత్నించిన ఉషారాణి, శేఖర్, బాలకిషన్‌లపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన లారీ : డ్రైవర్ మృతి



సుగుణాకర్(ఫైల్)

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో అతివేగంగా వచ్చిన బొగ్గు లోడు లారీ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీంఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గాఫున్ గ్రామానికి చెందిన లారీడ్రైవర్ జాబోరే సుగుణాకర్(26) బొగ్గు లోడుతో ఆసిఫాబాద్ నుంచి మాచర్లకు వెళ్తున్నాడు. శనివారం తెల్లవారుజామున డ్రైవర్‌కు నిద్ర రావడంతో అదుపు తప్పి నెమ్మికల్ గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న వేపచెట్టుకు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుగుణాకర్ లారీ క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. క్లీనర్ వెంకటేష్ బయటికి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో గంట సేపటికి డ్రైవర్‌ను బయటికి తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చెట్టు లేకపోతే ఇళ్లలోకి లారీ దూసుకపోయి భారీ ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. పలువురికి గాయాలు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా హాలియా నుంచి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం ఇనాంగూడలో బంధువుల ఇంటి వద్ద జరుగుతున్న బోనాల పండుగకు ఆటోలో వెళ్తున్నారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మందిలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఏడాది వయస్సు చిన్నారికి గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభానికి కట్టేసి కొట్టిన వారిపై కేసు నమోదు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నెపంతో ఇరువురిని స్తంభానికి కట్టేసి కొట్టిన సంఘటనలో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అడవిదేవులపల్లి మండలం బాలాజీతండాకు చెందిన సపావత్ రమేష్ జూలై 31న మండలంలోని నాయకునితండాకు వచ్చాడు. అయితే అదే తండాకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉన్నాడన్న అనుమానంతో ఆమె కుటుంబీకులు, బంధువులు కలిసి తండాకు చెందిన మహిళతో పాటు రమేష్‌ను స్తంభానికి కట్టేసి కొట్టారు. దీంతో రమేష్ భార్య సునీత ఫిర్యాదు మేరకు సంఘటనకు కారకులైన వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్లుగీత కార్మికులకు 'రక్షణ'



కాటమయ్య రక్షణ సామగ్రి సాయంతో తాటిచెట్టు ఎక్కుతున్న కల్లుగీత కార్మికులు

కల్లుగీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎంతోమంది తాటి చెట్ల పైనుంచి పడి మృతి చెందడంతో పాటు గాయపడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కల్లు విక్రయంతో జీవనం సాగించే కార్మికుల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ సామగ్రిని ఉచితంగా పంపిణీ చేస్తోంది. వీటి ద్వారా గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కి కల్లు గీసే సమయాల్లో ప్రమాదాలు జరిగినా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. కాటమయ్య రక్షణసామగ్రితో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే రెండు విడతల్లో వీటిని పంపిణీ చేశారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

- ప్రమాదాల నుంచి రక్షించేందుకు కాటమయ్య రక్షణ సామగ్రి
- సామగ్రితో తగ్గిన ప్రమాదాలు

కల్లుగీత కార్మికుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం బలహీనవర్గాల శాఖ ద్వారా ఎక్సైజ్ శాఖ సమన్వయంతో కాటమయ్య రక్షణ సామగ్రిని అందజేస్తున్నారు. జిల్లాకు మూడు విడతలకు సంబంధించి 3,735 కాటమయ్య రక్షణ సామాగ్రి వచ్చాయి. ఇప్పటికే రెండు విడతల్లో 1,575 మంది లబ్ధిదారులకు సామగ్రిని అందించారు. మరో విడత పంపిణీ చేయాల్సి ఉంది.

రెండేళ్లుగా 106 మంది...

సూర్యాపేట జిల్లాలో 2023 జనవరి నుంచి ఇప్పటివరకు 106 మంది కల్లుగీత కార్మికులు వివిధ సందర్భాల్లో ప్రమాదాల బారినపడ్డారు. అందులో 17మంది మృతి చెందగా, 26 మంది గీత కార్మికులు శాశ్వత అంగవైకల్యం పొందారు. ఇంకా 63మంది తాత్కాలిక వైకల్యం పొందారు. కాగా మృతి చెందిన, శాశ్వత అంగవైకల్యం పొందిన కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.10వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తోంది. రెండేళ్లుగా కార్మికులు ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురుచూస్తున్నారు.

26వేల మంది కల్లుగీత కార్మికులు

సూర్యాపేట జిల్లాలో 26వేల మంది కల్లుగీత కార్మికులున్నారు. వీరందరూ ఉదయం, సాయంత్రం సీజన్‌ను బట్టి తాటి, ఈత చెట్ల ద్వారా కల్లు సేకరించి విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అందిస్తున్న కాటమయ్య రక్షణ సామాగ్రిని పొందిన గీత కార్మికులకు ఎక్సైజ్, బీసీ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో వాటిని ఉపయోగించే విధానంపై శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా ప్రమాదం జరిగినప్పుడు ఏవిధంగా కాపాడుతుందో గీత కార్మికులు అవగాహన కల్పిస్తున్నారు.

తగ్గిన ప్రమాదాలు

ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అందిస్తున్న కాటమయ్య రక్షణ సామగ్రి ద్వారా గీత కార్మికులకు ప్రమాదాలు తగ్గాయి. సాధారణంగా గతంలో గీత కార్మికులు మోకుముస్తాదుతో తాటి, ఈత చెట్లను ఎక్కి కల్లుగీసే వారు. ఎక్కువగా తాటి చెట్లపై నుంచి మాత్రమే కింద పడి మృతి చెందడం, గాయపడడం జరుగుతోంది. తాటి చెట్టుపైన ఉన్న సమయంలో మోకు జారిన సమయంలో ఒక్కసారిగా కింద పడి మృతిచెందడం, గాయపడడం జరుగుతోంది. కాగా కాటమయ్య రక్షణ సామగ్రిని వారి మోకు ముస్తాదుకు బిగించుకుని కల్లుగీసేందుకు చెట్టు ఎక్కిన సమయంలో అనుకోకుండా మోకు జారినప్పటికీ గీత కార్మికులు మోకు బిగించుకున్న కాటమయ్య రక్షణ సామగ్రి ద్వారా ప్రమాదానికి గురికాకుండా ఆపుతుంది. కాటమయ్య రక్షణ సామగ్రి సుమారు మూడు టన్నుల బరువు వరకు రక్షణ కల్పిస్తుంది.



కాటమయ్య రక్షణ కిట్ ఉపయోగకరంగా ఉంది



ప్రభుత్వం ఇటీవల అందించిన కాటమయ్య రక్షణ సామగ్రి ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో కల్లుగీసే సమయంలో ప్రమాదం జరిగితే గీత కార్మికులు మృతి చెందడం, గాయపడడం జరిగేది. రక్షణ సామాగ్రి ద్వారా ప్రమాదం జరిగినా గీత కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ప్రతి గీత కార్మికుడు కల్లుగీసే సమయంలో విధిగా కాటమయ్య రక్షణ సామాగిరని ముస్తాదుకు బిగించుకోవాలి.

- వెంకన్న, కల్లుగీత కార్మికుడు సూర్యాపేట.

కాటమయ్య రక్షణ కిట్ ఉపయోగించాలి

జిల్లాలోని కల్లుగీత కార్మికులు విధిగా కాటమయ్య రక్షణ సామగ్రిని ఉపయోగించాలి. రక్షణ సామగ్రి ద్వారా గీత కార్మికుల ప్రమాదాలు తగ్గనున్నాయి. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కింద పడడంతో గీత కార్మికులు మృతి చెందుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. జిల్లాలోని అర్హులైన గీత కార్మికులందరూ కాటమయ్య రక్షణ సామగ్రి తీసుకోవాలి.

- లక్ష్మానాయక్, ఈఎస్, సూర్యాపేట.

అంతర్రాష్ట్ర ముగ్గురు దొంగల అరెస్టు

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మట్టిపల్లి శ్రీకాంత్, వెంకన్న, అనిల్‌లుగా తెలిపారు. శ్రీకాంత్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్ల మండలంలోని జనపాడులో నివాసముంటున్నాడు. ప్రస్తుతం ఇదే తరహా కేసులో జైలులో ఉన్నాడు. మిగతా ఇద్దరు ఎన్నారంలోనే ఉంటుండగా జల్సాలకు అలవాటు పడిన శ్రీకాంత్ ద్విచక్రవాహనాలను చోరీ చేస్తూ ఇక్కడికి పంపిస్తే వీరిద్దరు వాటిని విక్రయించేవారు. ఇదే క్రమంలో 2024లో నవంబరు 3న నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో కేతేపల్లి మండలం ఇనుపాములకు చెందిన తిరుగుడు సతీశ్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. దీంతో బాధితుడు నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కాగా శనివారం నార్కట్‌పల్లి పట్టణంలోని అమ్మనబోలు కూడలి వద్ద ఎస్‌ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేస్తున్న సమయంలో సరైన పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా ద్విచక్రవాహనాలపై తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి పేర్లు వెంకన్న, అనిల్‌లుగా చెప్పారని నకిలీ తాళం చెవులను ఉపయోగించి ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. వీరిద్దరిపై 12 ద్విచక్రవాహనాలు చోరీ చేయగా 7 కేసులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని చిట్యాల, నార్కట్‌పల్లి, సూర్యాపేట ప్రాంతాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సారావుపేట, గుంటూరు, చిలకలూరిపేట, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు నేరం అంగీకరించారని డీఎస్పీ వివరించారు. బైక్‌ల దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నార్కట్‌పల్లి సీఐ, ఎస్‌ఐలు కే.నాగరాజు, దగ్గుల క్రాంతికుమార్, హెచ్‌సీలు రాము, జవహర్, రమేశ్, సత్యనారాయణ, పీసీలు శ్రీకృష్ణ, శివ, తిరుమల్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారని డీఎస్పీతెలిపారు.

కల్యాణలక్ష్మిలో అనర్హులకు చోటు

మోత్కూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆదుకోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 అక్టోబరులో కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చింది. మొదట రూ.50 వేలతో ప్రారంభించి రూ. లక్షా 116కు పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగిస్తోంది. ఈ పథకం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు దరఖాస్తుతో పాటు వధూవరుల పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, వధూవరుల ఆధార్‌కార్డులు, అమ్మాయి కుటుంబం తెల్లరేషన్ కార్డు, వివాహం జరిగిన ఫొటోలు రెండు, గ్రామ కార్యదర్శి ధ్రువీకరణ, మరొక గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. కుటుంబంలో ఒక్కరికి, అదీ మొదటి పెళ్లి వారికే కల్యాణలక్ష్మి పథకం వర్తిస్తుంది. దరఖాస్తు ఇచ్చిన తర్వాత ఆర్ఐ అమ్మాయి ఇంటికి వెళ్లి వారు సమర్పించిన వివరాలు సక్రమమేనా అని విచారణ జరుపుతారు. సాక్షుల సమక్షంలో పంచనామా జరుపుతారు. ఆ తర్వాత తహసీల్దార్, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే సంతకాలు చేసి జిల్లా కేంద్రానికి పంపుతారు. అప్పుడు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరవుతాయి. ఇంత పకడ్బందీ ఏర్పాట్లు చేసినా ఇందులో అక్రమార్కులు చొరబడుతూనే ఉన్నారు. అనర్హులు కూడా కల్యాణలక్ష్మి చెక్కులు ఎగరేసుకపోతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో సుమారు పదేళ్ల క్రితం వివాహం జరిగిన యువతి పేరున ఆమె తల్లికి ఇటీవల రూ.లక్షా 116 కల్యాణలక్ష్మి చెక్కు అందింది. అర్హత లేని వారు సంక్షేమ పథకంలో లబ్ధిపొందడానికి నాయకుల ఒత్తిడినో, పైరవీకారుల ప్రమేయమో ఉంటుంది. పాలడుగు కేసులోనూ పైరవీకారి వల్లే జరిగినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. చెక్కు రావడంతో డబ్బులు చేతులు మారి ఉంటాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనర్హురాలికి చెక్కు ఇచ్చిన విషయం వెలుగులోకి రావడంతో ఈ నెల 1న తహసీల్దార్ జ్యోతి ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. పదేళ్ల కిందటే కుమార్తె వివాహం జరిగినట్లు లబ్ధిదారు అంగీకరించారని తహసీల్దార్ తెలిపారు. ఆమె నుంచి డబ్బు రికవరీ చేయడంతో పాటు ఆమెకు కల్యాణలక్ష్మి మంజూరు చేయడానికి సహకరించిన వారి వివరాలు కూడా తెలుసుకుని కలెక్టర్‌కు పూర్తి నివేదిక ఇస్తామని, కలెక్టర్ అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలి

పాలడుగు గ్రామంలో అనర్హులకు కల్యాణలక్ష్మి చెక్కు మంజూరుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని, వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు శనివారం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన ఆర్ఐ ప్రలోభానికి లోనై తప్పుడు రిపోర్టు ఇవ్వడం వల్లే పథకం దుర్వినియోగం అయ్యిందన్నారు. పేదలకు వరంగా ఉన్న కల్యాణలక్ష్మి పథకాన్ని దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ డిమాండ్ చేశారు.

నకిలీ సిమెంట్ కేసులో నలుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్

చివ్వెంల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ అక్రమ విక్రయాలు, నకిలీ బ్రాండింగ్‌తో విక్రయిస్తున్న కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్‌ఐ మహేశ్వర్ తెలిపారు. చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండలో సిమెంట్ దుకాణం నిర్వహిస్తున్న కావేటి రాజుకు లారీ డ్రైవర్లయిన ఉపేంద్రాచారి, మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే బాబులతో సిమెంట్ కంపెనీలకు చెందిన విడి సిమెంట్ అక్రమంగా విక్రయించేలా ఒప్పందం చేసుకున్నాడు. విడి సిమెంట్‌ను వివిధ బ్రాండ్లతో విక్రయించాలని భావించాడు. ఇందుకోసం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన బండి వెంకటరమణ నుంచి ఖాళీ బస్తాలను కొనుగోలు చేసేవాడు. ఆ బస్తాలపై వివిధ కంపెనీలకు చెందిన నకిలీ లోగో ముద్రించి సేకరించిన సిమెంట్‌ను నకిలీ బస్తాల్లో నింపి వినియోగదారులకు విక్రయించేవాడు. ఎన్‌సీఎల్ కంపెనీ సూపర్‌వైజర్ మాదా ప్రభాకర్ ఫిర్యాదు మేరకు మండలంలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఓ సిమెంట్ దుకాణంలో దాడులు నిర్వహించగా 980నకిలీ సిమెంట్ బస్తాలు, 30 ఖాళీబస్తాలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ, ఎస్‌ఐ తెలిపారు. కంపెనీల బ్రాండ్లతో ముద్రించి ఉన్నాయని కంపెనీల లోగోతో పరిశీలించగా అవి నకిలీవని తేలాయని వెల్లడించారు.

జీఎడవల్లిలో పేకాట శిబిరంపై మెరుపు దాడి

కనగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీ ఎడవల్లి గ్రామశివారులోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై విశ్వసనీయసమాచారం మేరకు పోలీసులు శనివారం మెరుపుదాడి చేపట్టారు. శిబిరంలో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి పేకముక్కలతో పాటు రూ.7.770 నగదును, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ జూదం, పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జీఎడవల్లి గ్రామంలో రెండురోజుల క్రితం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. ఇదిలా ఉండగా పేకాట శిబిరాలపై పోలీసుల వరుసదాడులను గ్రామస్థులు స్వాగతిస్తున్నారు.

బంగారం చోరీ చేసిన దొంగ రిమాండ్

పెన్‌పహాడ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ చేసిన దొంగను రిమాండ్ చేసినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేటరూరల్ సీఐ రాజశేఖర్ శనివారం విలేకరులతో తెలిపారు. పెన్‌పహాడ్ మండలం మేఘ్యాతండా పంచాయతీకి చెందిన కేవ్లాతండాకు చెందిన లకావత్ లక్‌పతి జూలై 28వతేదీన ఇంటికి తాళం వేయగాచివ్వెంల మండలం తుల్జారావుపేట గ్రామానికి చెందిన ధరావత్ మణిరామ్ తాళం పగలగొట్టి ఇంట్లోని తులం బంగారం, రూ.5వేలు నగదు చోరీ చేశాడు. బాధితుడు లకుపతి ఫిర్యాదు మేరకు క్లూస్ ఆధారంగా శనివారం నిందితుడిని తుల్జారావుపేటలోని తన ఇంట్లో అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు తోడు బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకున్న విద్యార్థులు, అవసరాలు తీర్చుకునేందుకు బ్యాంకు ఖాతాలు తెరిచి సైబర్ నేరగాళ్లకు అప్పగిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో డిజిటల్ అరెస్ట్ కేసులో దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం పోలీసులు ముగ్గురు విద్యార్థులను అరెస్ట్‌చేశారు. నల్లగొండ జిల్లా అనుముల గ్రామానికి చెందిన కే హేమంత్‌రెడ్డి, నల్లగొండ కంబాలపల్లికి చెందిన ఎం యశ్వంత్‌రెడ్డి, కార్థానాకు చెందిన ఎం తరుణ్ విద్యార్థులు. వీరు వ్యసనాలకు బానిస కావడంతోపాటు బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకున్నారు. సైబర్ నేరగాళ్లతో సంబంధం పెట్టుకున్న వీరు కమిషన్ పద్ధతిన దాదాపు 40 బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ఇచ్చారు. ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని మనీ లాండరింగ్ కేసుల పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్లు అతడి వద్ద నుంచి పలు దఫాలుగా రూ.6.50లక్షలు వసూలుచేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం అధికారులు బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి యశ్వంత్, హేమంత్, తరుణ్‌ల ఖాతాల్లో జమైనట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా వీరిని అరెస్ట్‌చేశారు. డబ్బుల కోసం గుర్తుతెలియని వ్యక్తికి తాము పలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, వివరాలు ఇచ్చామని నిందితులు ఒప్పుకున్నారు.

క్రిమినల్ కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కాకతీయ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ నీల సత్యనారాయణపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శనివారం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. 2008లో కోదాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం ఢిల్లీలోని ఏఐసీటీఈకు నకిలీ భూధ్రువపత్రాలు సమర్పించినట్లు తేలడంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

నార్కట్‌పల్లి పెద్దచెర్వుకు మహర్దశ

- మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చొరవ
- రూ.30కోట్లతో మినీట్యాంక్ బండ్‌గా ఆధునికీకరణ



సీసీ రోడ్డు, వాకింగ్ ట్రాక్ నమూనా చిత్రం

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పెద్ద చెర్వుకు మహర్దశ పట్టనుంది. ఇదే మండలానికి చెందిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో నార్కట్‌పల్లి చెర్వు అభివృద్ధికి బీజం పడింది. బీ.వెల్లెంల ఉదయసముద్రం రిజర్వాయర్ నుంచి నార్కట్‌పల్లి పెద్దచెరువులోకి నీరే చేరేందుకు ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తయ్యేలోపే సుమారు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో నార్కట్‌పల్లి పెద్ద చెర్వును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేలా ప్రణాళికలను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. నల్లగొండ ఆర్‌డీవో యానాల అశోక్‌రెడ్డి, ఐబీ డీఈఈ పిచ్చయ్యలు తమ సిబ్బందితో శనివారం చెర్వు కట్టను, స్థలాన్ని పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం సర్వే పనులను చేపట్టారు. డిటైల్డ్ రిపోర్టును వీలైనంత త్వరగా తయారు చేయించి ఆగస్టు 15వ తేదీన మినీ ట్యాంక్ బండ్‌కు శంకుస్థాపన చేయాలనే సంకల్పంతో మంత్రి, ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం.

సూర్యాపేట చౌదరి చెర్వు తరహాలో

సూర్యాపేట చౌదరి చెర్వు తరహాలో నార్కట్‌పల్లి పెద్ద చెర్వును కూడా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం కట్ట వెడల్పు 3.5 మీటర్లు ఉండగా దానిని 10 మీటర్లకు విస్తరిస్తారు. అదేవిధంగా కట్ట ఎత్తు ప్రస్తుతం 3.5 మీటర్లు ఉండగా ఆరు మీటర్ల వరకు పెంచనున్నారు. కట్టకు ఇరువైపులా వాకింగ్ ట్రాక్స్ విత్ టైల్స్‌ను వేయనున్నారు. సుమారు 1.150 కిలోమీటర్ల పొడువున్న ఉన్న చెర్వుకట్టపై వాహనాల రాకపోకలు సాగించేలా బీటీ లేదా సీసీ రోడ్డును వేయనున్నారు. కట్ట పొడవునా లైట్లు, కట్టకు ఇరువైపులా స్టీలు కంచెతో కూడిన రక్షణ గోడలను నిర్మించి పచ్చదనం కోసం చెర్వుకట్టకు పచ్చగడ్డిని అమర్చి సుందరీకరించనున్నారు. చెర్వుకట్ట రివిట్‌మెంట్‌ను రాళ్లతో కాకుండా పూర్తిగా సీసీతోనే పటిష్ఠం చేయనున్నారు. 300 మీటర్లకు ఒకటి చొప్పున కట్ట పొడువునా మూడు చోట్ల బతుకమ్మ ఘాట్‌లను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా కట్ట కింద బతుకమ్మ ఆడుకునేలా 10 మీటర్ల వెడల్పు గల స్థలంలో సీసీ వేయనున్నారు.



నమూనా చిత్రం

ఆహ్లాదం...ఆరోగ్యం

నార్కట్‌పల్లి పెద్ద చెర్వు ఆధునికీకరణ, సుందరీకరణ పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించనుంది. కుటుంబ సభ్యులతో సహా వచ్చి కట్టపై చల్లని పైరగాలిని, చెర్వు అందాలను, ప్రకృతి సోయగాలను కూర్చుని ఆస్వాదించేందుకు కుర్చీలను వేయనున్నారు. కట్టకు ఇరువైపులా టైల్స్‌తో కూడిన వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుతో పాటు వాకింగ్ అనంతరం చెర్వు కట్ట కింద యోగా, ధ్యానం చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు యువకులు ఓపెన్ జిమ్ చేసేందుకు కావల్సిన వసతులను, ఆట స్థలాన్ని ఏర్పాటు చేసేలా అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. స్థలం అవసరమైతే చెర్వు కట్టకు ఆనుకునే ఉన్న ఎండోమెంట్ స్థలాన్ని సేకరించాలని అధికారులు భావిస్తున్నారు.

సామాజిక సేవలో అంగన్‌వాడీలు

» గృహ హింస, వరకట్న వేధింపులపై అవగాహన » కౌమారదశ బాలికలకు స్వీయరక్షణపై కార్యక్రమాలు

పుట్టబోయే ప్రతిబిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంలో ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందజేస్తోంది. అంతేకాకుండా అంగన్‌వాడీ టీచర్ల ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి- చందంపేట)

నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో 67 అంగన్‌వాడీ కేంద్రాలను మూడు సెక్టార్లుగా విభజించి ఒక్కొక్క సెక్టార్‌కు ఒక పర్యవేక్షణ అధికారిని నియమించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పిల్లల అభివృద్ధిలో పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, ముందస్తు వైద్యపరీక్షల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికి తీసుకెళ్తున్నారు. చిన్నపిల్లల భవిష్యత్‌ను కాపాడడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయి. మండలంలో సుమారు 1,200 మంది నెల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు, వందమంది బాలింతలు, 120 మంది గర్భిణులు ఉన్నారు. వీరికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, బాలింతలకు ఊయల, పిల్లలకు అక్షరాభ్యాసాలు, వివిధ రకాల వినూత్న కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాలతో శిశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు తాగించడం తప్పనిసరి అని గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వివరిస్తున్నారు.



చందంపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేపడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

అందించే పోషక ఆహారం ఇదే..

ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఒక్కపూట సంపూర్ణ భోజనం, 150 గ్రాముల అన్నం, గుడ్డు, 200 మిల్లీలీటర్ల పాలు, 30 గ్రాముల పప్పు అందిస్తూ పిల్లలకు నెలకు 16 గుడ్ల చొప్పున పోషకాహారం అందజేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, తక్కువ బరువు, రక్తహీనత గల పిల్లలు పుట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే కౌమరదశలో ఉన్న బాలికల కోసం స్వీయ రక్షణ, పోషక ఆహార విలువలు, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరిస్తూ పిల్లల కోసం 1098, మహిళలకు 181 హెల్ప్‌లైన్ల గురించి చెబు తూ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ప్రభుత్వం అందించే పోషక ఆహారాన్ని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.

- చంద్రకళ, సీడీపీవో. చందంపేట

సముద్ర తీరాలకు ఆర్టీసీ బస్సు

● ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల, చీరాల బీచ్‌లకు సర్వీసులు

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ శుభ వార్త చెప్పింది. ఇప్పటివరకు వివిధ డిపోల నుంచి తిరుపతి, అరుణాచలం, భద్రాచలం, శ్రీశైలం,విజయవాడ, యాదగిరిగుట్ట తదితర ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలకు బస్సులు నడుపుతోంది. ఇక నుంచి విహార యాత్రలకు బస్సులు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డిపో నుంచి ఆంధ్రపదేశ్‌లోని బాపట్ల, చీరాల బీచ్‌లకు ప్రతి ఆదివారం బస్సులను నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు.



రద్దీని బట్టి అదనపు బస్సులు



ఆధ్యాత్మిక, విహార యాత్రలకు వెళ్లే ప్రయాణికులక సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నాం. ప్రయాణికుల ఆసక్తి, ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రతీ ఆదివారం బాపట్ల, చీరాల బీచ్‌లకు బస్సును ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉంటే అదనపు బస్సులను నడిపిస్తాం. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. టికెట్ బుకింగ్ కోసం 9298008888, 73828 33790 నెంబర్లను సంప్రదించాలి.

- రామ్మోహన్‌రెడ్డి, డిపో మేనేజర్, మిర్యాలగూడ

● చార్జీలు ఇలా..

మిర్యాలగూడ పట్టణం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, బాపట్ల బీచ్‌లకు ప్రతి ఆదివారం డీలక్స్ బస్సులను నడిపి ంచేందుకు ఏర్పాట్లు చేశారు అధికారులు. పెద్దల చార్జీ రూ.800, పిల్లల చార్జీ రూ.500గా నిర్ధారించారు. ఆదివారం ఉదయం 3 గంటలకు డిపో నుంచి బయలు దేరే బస్సు అదే రోజు రాత్రి 9 గంటలకు పట్టణానికి చేరు కుంటుందని అధికారులు తెలిపారు. రద్దీని, డిమాండ్‌ను బట్టి అదనపు బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సెలవు దినాల్లో బీచ్‌లకు బస్సులు ఏర్పాటు చేయనున్నారు.

సాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద



సాగర్ 20 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక స్వల్పంగా తగ్గింది. శుక్రవారం సాయంత్రం వరకు సాగర్‌కు ఎగువ నుంచి 2,57,342 క్యూసెక్కుల వరద వచ్చి చేరగా, శనివారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 1, 98,913 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోం ది. అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 585.20 అడుగులు (298 .0120 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,023 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 7,937 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేం ద్రం ద్వారా 29,273 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్ గేట్లల్లో 20 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి దిగువకు 1,51, 580 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్ నుంచి మొత్తం 1,98,913 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, అంతే మొత్తం నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రీతిలో వైభవంగా చేపట్టారు. స్వామి అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు ఏకాంతం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలోస్ఫటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు కొనసాగా యి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 22, 91,729 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, సంగీత సభల్లో భాగంగా కీర్తన కల్చరల్ సొసైటీ (పాలమూరు) రాజేశ్వరీ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 23న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన స్వర్ణ దివ్య విమాన రాజగోపురాన్ని ఈ సందర్భంగా తొలిసారి పవిత్రీకరించనున్నారు. సుదర్శన ఆళ్వారుకు తొలుత పవిత్రాధారణ చేస్తారు. ఐదు అంతస్తుల్లోని (50 అడుగుల ఎత్తులో) స్వర్ణ గోపురాన్ని అభిషేకించేందుకు చుట్టూ పరాంజ బిగించారు. ఆలయంలో నిర్వహించే వార్షిక, నిత్య పూజాది కార్యక్రమాల్లో తెలిసో తెలియకో జరిగే దోషాలు, పొరపాట్ల సవరణకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజు విష్వక్సేన పూజ, రెండో రోజు పవిత్రల రూపకల్పన పూజ, మూడో రోజు ప్రతిష్ఠ, పవిత్రల అలంకరణకు ఆలయ పూజారులు సిద్ధమవుతున్నారు. పాతగుట్ట ఆలయంలో కూడా యథావిధిగా పవిత్రోత్సవాలు కొనసాగనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా 5, 6 తేదీల్లో ఉభయ ఆలయాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహోత్సవాలు, లక్ష పుష్పార్చన, సుదర్శన నారసింహ హోమం రద్దు చేస్తున్నట్టు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

ఆలయ భూముల రక్షణకు సర్వే



భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దేవాదాయశాఖకు చెందిన భూములు ఆక్రమణల నుంచి రక్షించేందుకు రక్షణ చర్యలు చేపట్టింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను గుర్తించేందుకు శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ జీ.వీరారెడ్డి భువనగిరి ఆర్డీవో మాలి కృష్ణారెడ్డితో కలిసి శ్రీకారం చుట్టింది. వైటీడీఏ పరిధిలోని ఆలయ భూములకు గాను డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(డీజీపీఎస్) ద్వారా డిజిటలైజేషన్ చేసి నక్ష హద్దులకు నిర్ధారించనున్నారు. భూముల ఆధునికీకరణతో ఆక్రమణలను గుర్తించడంతో పాటు వాటి రక్షణ సులభతరం చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. డీజీపీఎస్ సాంకేతికతతో పాటు జీపీఎస్, ఈటీఎస్, క్యాడ్ సాఫ్ట్‌వేర్ ద్వారా భూ సర్వేలు నిర్వహిస్తారు. సర్వే తదనంతరం మ్యాపులు రూపొందించే అవకాశాలు ఉండగా ఆలయ భూముల వివరాలు, నక్షా హద్దులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ఎప్పటికప్పుడు భూముల ధరలతో పాటు ఆక్రమణల పర్వం ఆగడం లేదు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్‌నాయక్, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పర్యవేక్షకుడు దాసోజు నరేష్, సర్వేయర్లు లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్ట ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులేనా?

యాదగిరిగుట్ట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధానార్చక పోస్టు ఖాళీ ఏర్పడింది. భర్తీ చేసేందుకు అధికారులు సీనియర్ అర్చకుడి నుంచి దరఖాస్తును స్వీకరించగా ఇప్పుడు అధికారుల పరిశీలనలో ఉంది. సుమారు 1992 సంవత్సరంలో అర్చకవృత్తిని స్వీకరించిన భట్టర్ సురేంద్రచార్యులు అర్హుడిగా ప్రచారం సాగుతోంది. ఇదే విషయమై ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మను వివరణ కోరగా భట్టర్‌కు చెందిన ఫైల్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం కాండూరి వెంకటాచార్యులు కొనసాగుతుండగా రెండో ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులు నియామకం కానున్నారు. ప్రధానార్చకుడిగా నియామకం చేయాలంటే ము ఖ్యంగా వేట, జూదం, స్త్రీ వ్యామోహం, మద్యపానం, మాటలో పరుషత్వం, దండన, ధనం వృథా చేయడం వంటి వ్యసనాలకు దూరంగా ఉన్న అర్చకుడిని ఎంపిక చేస్తారు. కాగా, ఉద్యోగ విరమణ పొందిన నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు స్థానాచార్యులు అవకాశం కోసం దేవాదాయ శాఖకు ఇదివరకే సంప్రదించారు. ఆయన ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ కొందరు అర్చకులు అధికారులు కలుస్తున్నట్లు తెలిసింది.

మట్టపల్లిలో వైభవంగా లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో వేదపండితులు కన్నులపండువగా శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ, తలంబ్రాలుతో నిత్యకల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాలకవర్గ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దుకాణానికి పులి కాపలా

● కోతుల బెడద నేపథ్యంలో ఉపాయం

మఠంపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం వర్ధాపురంలో ఓ దుకాణానికి పులిని కాపలాగా పెట్టారు ఓ దుకాణ యజమాని. కోతుల బెడద నుంచి సరుకులు కాపాడుకునేందుకు బొమ్మ పులిని ఏర్పాటు చేశారు. దీంతో అటుగా వెళ్లే వారు సరుకుల కోసం షాపునకు వచ్చే వారు గోడపై పులి బొమ్మను చూసి బెదిరిపోయారు. దుకాణంలోని సరుకులను రోజు కోతులు ఎత్తుకొనిపోవడంతో ఆ బాధ నుంచి తప్పించుకునేందుకు పులిబొమ్మను ఏర్పాటు చేసినట్లు దుకాణ యాజమాని సీహెచ్. సుభద్రమ్మ తెలిపారు.



వర్ధాపురంలో దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పులిబొమ్మ

బుద్ధవనం సందర్శన వేళలు పొడిగింపు

నాగార్జునసాగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బు ద్ధవనం సందర్శన వేళలు పొడిగించినట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు బుద్ధవనం సందర్శన వేళలు ఉండగా ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీ టిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. పర్యాటకుల సౌకర్యార్థం బుద్ధవనం సందర్శన వేళలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.



బుద్ధవనం ఏరియల్ వ్యూ

పింఛన్ పాట్లు



పింఛన్ కోసం బారులుదీరిన వృద్ధులు, లబ్ధిదారులను ఫొటో తీస్తున్న సిబ్బంది

ఆసరా పింఛన్ అంటే వయోభారం, నడవలేని, నిలబడలేని, మతిస్థిమితం లేని వారే అధిక సంఖ్యలో ఉంటారు. అయితే ప్రభుత్వం ఈ నెల నుంచి ముఖఛాయ చిత్రం ద్వారా పింఛన్ పంపిణీ చేస్తుండటంతో వృద్ధులు, దివ్యాంగులు లైన్‌లో దాదాపు గంటపైగా నిల్చుంటూనే పింఛన్ అని పరిస్థితి నెలకొంది. జిల్లాలో భువనగిరి పోస్టాఫీస్, యాదగిరిగుట్ట మునిసిపల్ కార్యాలయం వద్ద పింఛన్‌దారులు క్యూలైన్‌లో నిలబడి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పింఛన్ కార్యాలయం వద్ద కనీసం, కుర్చీలు, మంచినీళ్ల సౌకర్యాలు కల్పించాలన్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి-యాదాద్రి

మహిళల జీవితాల్లో సోలార్ వెలుగులు

● పైసా పెట్టుబడి లేకుండా నెలకు రూ.2 నుంచి 3 వేల వరకు ఆదాయం ● రోల్‌మోడల్‌గా మారనున్న అయిటిపాముల

కట్టంగూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికి పరిమితమై కాకుండా ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమి లేదని అన్ని రంగాల్లో రాణించవచ్చని అయిటిపాముల గ్రామానికి చెందిన మహిళా సంఘాలు నిరూపిస్తున్నాయి. ఒకరిపై ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడటం కోసం స్వయం ఉపాధిని పెంచుకుంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుం టూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో తమదైన శైలిలో మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారు. పైసా ఖర్చు లేకుండా సోలార్ ప్యానల్ సిస్టమ్‌తో స్వయం ఉపాధి పొందుతున్నారు. సోలార్ ప్యానల్‌తో విద్యుత్‌ను స్టోరేజీ చేసి స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు నెలకు రూ.2 నుంచి రూ.3వేల వరకు ఆదాయం పొందుతున్నారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన 50 మందిని ఎంపిక చేసి వారి ఇళ్లపై స్వచ్ఛ శక్తి



విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ ఆటో

ఆఫ్ గ్రిడ్ సోలార్ సిస్టమ్‌తో చార్జింగ్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసింది. ఈ సోలార్ ప్యానల్ సిస్టమ్ దేశంలోనే మొట్టమొదటిసారిగా నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో స్వభాగ్ ల్యాబ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనైనది.

కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా...

ఈ సోలార్ ప్యానల్ సిస్టమ్‌ను గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, విద్యుత్ వాడటానికి తగ్గించడానికి ఉపయోగపడుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చనే ఉద్దేశ్యంతో ఈ సిస్టమ్ గురించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పూర్తి వివరాలతో తెలియజేశారు. మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన స్వభావ్ ల్యాబ్స్‌కు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మంత్రి వెంకట్‌రెడ్డి ఇటీవల రూ.50 లక్షలు మంజూరు చేసి గ్రామంలోని మహిళా సంఘాలకు చెక్కులను అందజేశారు. ఈ డబ్బులతో స్వభాగ్ ల్యాబ్స్ వారు మహిళా సంఘాలతో రెండేళ్ల పాటు ఒప్పందం చేసుకొని అర్హులైన 50 మంది మహిళల ఇళ్లపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు వారంలో ఒకటి లేదా రెండుసార్లు సోలార్ ప్యానల్‌ను శుభ్రం చేసి రూ.2 నుంచి 3 వేల వరకు నేరుగా వారి ఖాతాలోనే డబ్బులు జమ అవుతున్నాయి.



కట్టంగూరు : అయిటిపాములలో నిల్వ ఉంచిన చార్జింగ్ బ్యాటరీలు

వాహనాల విక్రయం....

గ్రామంలోని స్వచ్ఛ శక్తి కేంద్రం వద్ద స్వభాగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించడంతో పాటు బ్యాటరీలను అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. ఇక్కడ ఎలక్ట్రిక్ వాహనాన్ని ఒకసారి చార్జింగ్ చేస్తే ద్విచక్రవాహనం 80 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సంస్థలో ఎలక్ట్రిక్ స్కూటీలతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను కూడా విక్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కొక్క సోలార్ ప్యానల్‌తో రోజుకు రెండు నుంచి మూడు బ్యాటరీలు రీచార్జీ అవుతాయి. ఈ సంస్థ బ్యాటరీని రూ.80 రూపాయల చొప్పున వాహనదారులకు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని పొందుతున్నారు.

సోలార్ ప్యానల్‌తో ఉపాధి పొందుతున్నాం



పైసా ఖర్చు పెట్టుబడి లేకుండా సోలార్ ప్యానల్ సిస్టమ్ ద్వారా చార్జింగ్ పెట్టిన బ్యాటరీలకు స్వభాగ్ ల్యాబ్ వారు యూనిట్‌కు రూ. 16.50 చెల్లిస్తున్నారు. నెలకు రూ.2 వేల వరకు ఆదాయం సంపాదించుకుంటూ ఉపాధి పొందుతున్నాం. దీంతో పాటు అదనంగా సోలార్ ప్యానల్ యూనిట్ల సంఖ్య పెంచుకుంటే మహిళలు ఎక్కువ మ మొత్తంలో ఆదాయం పొందవచ్చు. ఈ సంస్థ వల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది.

-చెవుగోని సైదమ్మ, ఎఫ్‌పీవో చైర్మన్, అయిటిపాముల

ఉపాధి కల్పించడం అభినందనీయం



ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో సోలార్ ప్యానల్‌ను మా గ్రామంలో ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడం చాలా సంతోషంగా ఉంది. ఈ విధానంలో ప్రతీ నెలా వచ్చే ఆదాయంతో మా కుటుంబ ఖర్చులను వెళ్లదీస్తున్నాం. సోలార్ ప్లేట్ల క్లీనింగ్ సిబ్బందికి సహకరించడం తప్ప మేము ఎలాంటి రిస్క్ చేయడం లేదు. మా గ్రామంలోని మహిళలకు ఉపాధి కల్పించినందుకు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్‌కు స్వభాగ్ ల్యాబ్ సంస్థ వారికి ధన్యవాదాలు.

-గోలి రాజేశ్వరి, అయిటిపాముల

దేశంలోనే మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్టు



సోలార్ విద్యుత్ బ్యాటరీ దేశంలోనే ఇది మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటిపై రెండు సోలార్ ప్యానల్స్‌తో నేరుగా బ్యాటరీ రీచార్జి అవుతుంది. ఈ సిస్టమ్‌లో బ్యాటరీ 100శాతం చార్జీ అవగానే ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతుంది. స్వభాగ్ ల్యాబ్ వారు ఐవోటీ ద్వారా బ్యాటరీ చార్జీ తెలుసుకొని వెంటనే అక్కడికి వెళ్లి మరో బ్యాటరీ అమర్చుతాం. ఒక్కొక్క బ్యాటరీ రెండు యూనిట్ల విద్యుత్‌ను స్టోరేజీ చేసుకుంటుంది. దీనిని ఆధారంగా చేసుకొని భవిష్యత్తులో మరిన్ని స్వచ్ఛ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. మేమే బ్యాటరీలను కొనుగోలు చేసి మహిళలకు ప్రతి నెల రూ.2 నుంచి 3 వేల వరకు చెల్లిస్తున్నాం.

జి.సుధాకర్ బాబు, సీఈవో, స్వభాగ్ ల్యాబ్స్

విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదగాలి

చిట్యాల, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దాతల సహకారాన్ని అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని చిట్యాల జడ్పీ హైస్కూల్ హెచ్ఎం గోగికార్ మాధవి అన్నారు. పది పరీక్షా ఫలితాల్లో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు చిట్యాలకు కొరివి వెంకన్న శనివారం ఆర్థికసాయం అందజేశారు. మొదటి ర్యాంకు సాధించిన ఇమ్మడి బాలాజీకి రూ.25వేలు, ఎస్‌కే.ఫాతీమాకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో కొరివి శ్రీకాంత్, బూరుగు కృష్ణయ్య, బుద్ద కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అనంత స్వర్ణగిరిపై మాస కల్యాణం

నార్కట్‌పల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని అనంత స్వర్ణగిరిపై ఉన్న పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం మాస కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. యాజ్ఞికుడు నర్సింహాచార్యులు, సహఅర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన ఈ వేడుకలో దేవాలయ నిర్మాణదాత శ్రీరామదాసు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉండ్ర లింగారెడ్డి, భాగ్యమ్మ దంపతులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవం అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నీలగిరిలో మరో రూ.109 కోట్లతో

అభివృద్ధి పనులు

- రోడ్లు, మురుగు, శ్మశానవాటికల అభివృద్ధి
- ఈ నెలలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం
- రూ.56 కోట్లతో నడుస్తున్న పనులు

నల్లగొండ పట్టణంలో మరో రూ.109 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వివిధ రకాల పనులకు ఈ ఆగస్టు నెలలోనే శంకుస్థాపన చేయనున్నారు. ప్రధానంగా పట్టణంలో మంచినీరు, రోడ్లు, డ్రైనేజీలు, వరద కాల్వ ల వంటి అభివృద్ధి పనులపై యంత్రాంగం దృష్టి సారించింది. పట్టణ ప్రజల అవసరాల మేర నాటి పాలకవర్గం ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావడంతో అధికారులు అందుకు తగ్గట్లుగా ప్రణాళికలు రూపొందించి టెండర్లు పిలిచారు. దీంతో హైదరాబాద్‌కు చెందిన బృంద ఇంజనీరింగ్ ఏజెన్సీ టెండర్ దక్కించుకుంది. దీంతో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నల్లగొండ పట్టణంలో మంచినీరు ఇప్పటి వరకు రోజు విడిచి రోజు వచ్చేవి. ఇకపై ప్రతీ రోజు మంచినీరు సరఫరా చేయాలన్న ఉద్దేశ్యంతో రూ.96 కోట్ల ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించారు.

- (ఆంధ్రజ్యోతి,రామగిరి)

పట్టణంలో రూ.109 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ టెండర్ ప్రక్రియ గతేడాది ప్రారంభించింది. టెండర్ ప్రక్రియలో బృంద ఇంజనీరింగ్ ఏజెన్సీ టెండర్ దక్కించుకుంది. ఈ రూ.109 కోట్లలో రూ.55కోట్లతో 94 కి.మీ సీసీ రోడ్లు, రూ.11 కోట్లతో 9 కి.మీ బీటీ రోడ్లు, రూ.19 కోట్లతో 9.5 కి.మీ వరద కాల్వలు, రూ.2 కోట్లతో గొల్లగూడ ప్రాంతంలో శ్మశానవాటికతో పాటు మరికొన్ని పనులు ఉన్నాయి. వీటి నిర్మాణానికి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తుంది. మొత్తానికి ఈ పనులు ఈ నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

రూ.96 కోట్లతో మంచినీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు

పట్టణ ప్రజలకు ప్రతీ రోజూ మంచినీరు అందించాలన్న ఉద్దేశ్యంతో రూ.96కోట్లతో పట్టణంలోని పానగల్ ప్రాంతంలో 70 ఎంఎల్‌డీ కెపాసిటీ గల మంచినీటి శుద్ధి కేంద్ర ఏర్పాటుకు గత పాలకవర్గం నిర్ణయించింది. ఈ మంచినీటి శుద్ధి కేంద్రం 2053 వరకు మంచినీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా డిజైన్ చేశారు. ఈ శుద్ధి కేంద్రం ప్రారంభమైతే పట్టణంలో ప్రతీరోజు మంచినీరు సరఫరా కానుంది. ఈ రూ.96 కోట్లతో 12 కిలోమీటర్ల పైపులైన్లతో పాటు మంచినీటి శుద్ధి కేంద్రానికి ఖర్చు చేయనున్నారు. ఇదిలా ఉండగా 2 లక్షల పైచిలుకు జనాభా ఉన్న నల్లగొండ పట్టణంలో ఇప్పటివరకు రోజు విడిచి రోజు 44 ఎంఎల్‌డీ మాత్రమే మంచినీరు సరఫరా అవుతుంది. అయితే నూతనంగా నిర్మించబోయే శుద్ధి కేంద్రం పూర్తయితే 114 ఎంఎల్‌డీ మంచినీరు ప్రతీ రోజు సరఫరా అయ్యే అవకాశం ఉంది. అర్బన్ ఇన్‌ఫ్రా డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు చేసేందుకు ఇక్కడి అధికారులు, నాటి పాలకవర్గం కలిసి ఏడాది క్రితం హైదరాబాద్ మునిసిపల్ శాఖ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు నివేదించారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించిన మునిసిపల్‌శాఖ కేంద్ర ప్రభుత్వానికి నివేదించనుంది. కేంద్రప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే టెండర్ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



ఇప్పటికే రూ.56 కోట్లతో కొనసాగుతున్న పనులు

ఇదిలాఉండగా అమృత్ -2 పథకం ద్వారా నల్లగొండ పట్టణంలో రూ.56 కోట్లతో మంచినీటి పనులు నడుస్తున్నాయి. వీటిలో రాంనగర్, అక్కచెల్మ, బత్తాయి మార్కెట్, వినాయక హౌసింగ్ బోర్డు కాలనీ, అన్నేశ్వరం గుట్ట, వల్లభరావు చెరువు, దత్తసాయి కాలనీ, ప్రభుత్వ ఆసుపత్రి అవరణలో, మధురానగర్, పాతబస్తీ శివాలయం సమీపంలో, రాఘవేంద్ర నగర్ వంటి ప్రాంతాల్లో 11 ట్యాంకులతో పాటు 40 కిలోమీటర్ల మేర పైపులైన్ల పనులు నడుస్తున్నాయి.

ఈ నెలలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశం



రూ.109 కోట్లతో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, వరద, మురుగుకాల్వల వంటి అబివృద్ధి పనులకు పిలిచిన టెండర్ ప్రక్రియ పూర్తయింది. స్థల పరిశీలన కూడా జరుగుతుంది. ఈ పనులు ఈ నెల చివరి వారంలోగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అదే విధంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు రూ.40 లక్షలతో టెండర్లు పిలిచాం. ఈ ప్రక్రియలో కూడా త్వరలోనే ప్రారంభం కానుంది. మీడియన్‌లో మొక్కలను నాటేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చండూరు రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మండల ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరై ప్రారంభిస్తారని, మండలంలోని ప్రజలు ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతున్న శిబిరంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి శుక్లాల ఆపరేషన్ అవసరం ఉన్న వారిని వెంటనే హైదరాబాద్ తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ చేయించి తీసుకురానున్నట్లు తెలిపారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవసరమైన మందులు, కళ్ల జోళ్లు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు.

సూర్యాపేటకు నేడు బీఎస్పీ స్టేట్ కోఆర్డినేటర్ ఆథార్‌సింగ్ రాక

కట్టంగూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సూర్యాపేటలో ఆదివారం నిర్వహించే బీఎస్పీ ఉమ్మడి జిల్లా సమీక్షా సమావేశానికి సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ ఆథార్‌సింగ్ రానున్నట్లు పార్టీ జోనల్ కోఆర్డినేటర్ కత్తుల కాన్షీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశానికి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

హక్కుల కోసం పోరాడాలి

● టీజీకేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనుగుండ్ల అచ్చాలు



సామాజిక చైతన్య యాత్రను ప్రారంభించి మాట్లాడుతున్న అచ్చాలు

నార్కట్‌పల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): గీతవృత్తి చేస్తూనే గీత కార్మికుల సంక్షేమం కోసం పోరాడి అమరుల యాదిలో హక్కుల కోసం పోరాడుదామని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం (టీజీకేజీకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పామనుగుండ్ల అచ్చాలు పిలుపునిచ్చారు. ఈ నెల 2వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న గీత కార్మికుల సామాజిక చైతన్యయాత్రను శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అవురవాణిలో అమరజీవి బైరు మల్లయ్య విగ్రహం వద్ద ప్రారంభించిన అనంతరం కల్లుగీత కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. గీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన కుటుంబాలను యాది చేసుకుంటూ గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే ఈ యాత్ర ఉద్దేశమన్నారు. అవురవాణిలో ప్రారంభించిన ఈ యాత్రను ఆగస్టు 18 సర్దార్ సర్వాయి పాపన్న జయంతి రోజున భువనగిరిలో ముగిస్తామని తెలిపారు. గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సామాజిక చైతన్య యాత్రను విజయవంతం చేయాలని అచ్చాలు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న, సహాయ కార్యదర్శి రాచకొండ వెంకట్, కల్లూరి కంఠమహేశ్వర్, ఉప్పల గోపాల్, గుడుగుంట్ల బుచ్చిరాములు, బైరు మల్లయ్య కుమారులు భాస్కర్ గౌడ్, నరేందర్, రవి, ప్రజాసంఘాల నాయకులు చెర్కు పెద్దులు, వెంకటేశ్వర్లు, హనుమంతు, అవురవాణి సొసైటీ అధ్యక్షుడు నరిసింహ, వెంకటేశం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న దశరథ

చిట్యాల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): చిట్యాలకు చెందిన ఉండ్రాతి దశరథకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అవార్డు ప్రదానం చేసింది. ఇన్వెస్టిగేషన్ ఆఫ్ రేర్ ఎర్త్ మెటల్ అయాన్స్ సబ్‌స్టూషన్ ఎఫెక్ట్ ఆన్ ది స్ట్రక్చరల్, ఆప్టికల్, ఎలక్ట్రికల్, మాగ్నటిక్ అండ్ ఫొటో కాటల్యాటిక్ యాక్టివిటీ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్ మెగ్నీషియం స్పినల్ ఫెర్రైట్స్ అనే అంశంపై ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆయన డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆయన మోర్తాడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టరేట్‌ను అందుకున్న దశరథను కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

నేడు పెద్దకాపర్తిలో ఎస్‌బీఐ జనసురక్ష కార్యక్రమం

● హాజరుకానున్న ఎస్‌బీఐ ఎండీ రామ్మోహన్

చిట్యాలరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీన చిట్యాల మండలం పెద్దకాపర్తిలో జనసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చిట్యాల శాఖ మేనేజర్ బొజ్జగాని సతీష్ తెలిపారు. పెద్దకాపర్తిలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసే జనసురక్ష కార్యక్రమంలో రైతులకు అందించే వ్యవసాయ రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, బీమా పథకాలకు సంబంధించిన వాటిని వివరించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొని రైతులకు ప్రజలకు కేంద్రప్రభుత్వం, ఎస్‌బీఐ ద్వారా అందించే సేవలను ఎస్‌బీఐ ఎండీ అమర రామ్మోహన్‌రావు వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గ్రామంలోని రైతులు, సమభావన సంఘాలతో పాటు గ్రామస్థులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

ఈత, ఖర్జూర వనాలు పెంచాలి



ఈత, ఖర్జూర మొక్కలు నాటుతున్న గీత కార్మికులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని చిప్పలపల్లి రాచ కాల్వ కట్టకు ఈత, ఖర్జూర మొక్కలను కల్లుగీత కార్మిక పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో శనివారం నాటారు. ఈ కార్యక్రమంలో ఆబ్కారీ శాఖ నల్లగొండ డివిజన్ సీఐ బీ.ప్రసాద్, ఎస్ఐ.బాలవర్ధన్, ఈజీఎస్ ఎఫ్ఏ శ్రీదేవి, సంఘం అధ్యక్షుడు వాసు, ఉపాధ్యక్షుడు బత్తిని రమేష్, కార్యదర్శి పనసం ధనుంజయ్య, మాజీ ఉపసర్పంచ్ బత్తిని రాంబాబు, రామనర్సయ్య, సత్తయ్య, పాపయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలి

● ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

నల్లగొండ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో శనివారం నిర్వహించిన ఐద్వా జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదు గ్యారెంటీల్లో భాగంగా రాష్ట్రంలోని ప్రతీ మహిళకు నెలకు రూ.2500 చెల్లిస్తామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీని 18 నెలలు గడిచినా నేటికి అమలు చేయలేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీ కూడా ఊసే లేదన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని గ్రామాల్లో బెల్టు షాపులు అనుమతించడం వల్ల మద్యం మత్తులో మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు, వేధింపులు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారు. చిన్నారులపై జరిగిన కేసుల్లో పాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ వేగవంతం చేయాలని, 3 నుంచి 6 నెలల్లో నిందితులకు శిక్షలు అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయిలో పరిశీలన చేపట్టి, మహిళల సమస్యలపై ఉద్యమాలు, పోరాటాలు చేస్తామని, అందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ, జిల్లా ఆఫీసు బేరర్లు ఎండీ సుల్తానా, దామెర లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



పిట్టంపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న బాలింతలు, టీచర్లు

శాలిగౌరారం, కట్టంగూరు, చిట్యాలరూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తల్లీ పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అధికారులు అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు అమృతంలాంటివని బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టాలని తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమన్నారు. రోగ నిరోధకశక్తినందించి ఆరోగ్యంగా ఉండేలా బిడ్డ ఎదుగుదలతో ఎంతగానో దోహదపడతాయన్నారు. ఆరు నెలల వరకు పిల్లలకు తల్లిపాలు ఇచ్చిన తర్వాత అనుబంధ పౌష్టికాహారం ఇవ్వాలని కోరారు. ప్రతి తల్లి తన బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలని సూచించారు.

● శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి మాట్లాడుతూ మాట్లాడుతూ పాప పుట్టగానే ముర్రుపాలు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పి.అమృతమ్మ, పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

● కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబటివాగులో ఐసీడీఎస్, మండల పరిషత్ అధికారుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్ఞాన ప్రకాశ్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారదరాణి, ఏఎన్ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు బిక్షమమ్మ, సైదమ్మ, హెచ్‌ఎం పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతల కు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యులు, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారుల అవస్థలు



సరంపేట్ గ్రామంలో సర్వర్ బిజీతో ఆసరా పింఛన్‌దారుల నిరీక్షణ

మర్రిగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరంపేట గ్రామంలో శుక్రవారం ఆసరా చేయూత పింఛన్లు తీసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులకు సర్వర్ పనిచేయకపోవడం సిగ్నల్ సక్రమంగా అందనందున పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు దివ్యాంగులు ఒంటరి మహిళలు వితంతువులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గంటలు తరబడి వరుసలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడినది. ఆసరా ఫించన్ల పంపిణీ చేయు విషయంలో వేలి ముద్రను తొలగించి లబ్ధిదారుల ముఖ గుర్తింపును ద్వారా అందించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలుచేసింది. దీంతో ఫించన్ దారులకే కాకుండా పించన్లు పంపిణీ చేసే అధికారులకు సైతం కొంత మేరకు ఇబ్బందులు కలుగుతున్న పరిస్థితి నెలకొన్నది.

శరవేగంగా పనులు

(5వపేజీ తరువాయి)

సంబంధించి భూమి చదునుచేసే పనులు కొనసాగుతున్నాయి.

జెన్‌కో అధికారులు పేర్కొంటున్నారు. ఫ్లైయాష్‌ను 12 గంటల పాటు నిల్వ ఉంచేందుకు 2,550 మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో ప్లాంట్‌లోనే నాలుగు ఫ్లైయాష్ పాండ్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తయ్యే ఫ్లైయాష్‌ను స్థానికంగా ఉన్న సిమెంట్ కంపెనీలు తీసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. జాతీయస్థాయి సిమెంట్ కంపెనీలైన అదానీ, అల్ట్రాటెక్, శ్రీసిమెంట్, అల్ట్రాసిమెంట్ కంపెనీలు సైతం వ్యాగన్ ద్వారా దీర్ఘకాలికంగా సరఫరాచేస్తే తీసుకునేందుకు ఆసక్తికనబరుస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం మార్కెట్ ప్రకారం ఇక్కడ ఉత్పత్తయ్యే ఫ్లైయాష్‌కు మెట్రిక్‌టన్నుకు రూ.565 ఇష్యూ ప్రైస్ నిర్ధారణ చేశారు. తొమ్మిది కంపెనీలు ఈ ధరకు ప్రతిరోజూ 2వేల మెట్రిక్‌టన్నుల వరకు ఫ్లైయాష్ తీసుకునేందుకు సిద్ధమయ్యాయి. అదేవిధంగా ఫ్లైయాష్‌ను వ్యాగన్ల ద్వారా తరలించేందుకు వీలుగా సమాంతర రైల్వేలైన్ నిర్మాణానికి ఢిల్లీకి చెందిన ఓ సంస్థ డీపీఆర్ సమర్పించింది. వీటన్నింటిపై ప్లాంట్ పూర్తిస్థాయి విద్యుదుత్పాదనకు సిద్ధమయ్యేలోగా ప్రభుత్వం ఉన్నత స్థాయిలో తీసుకునే నిర్ణయం మేరకు జెన్‌కో కార్యాచరణ అమలు చేయనుంది.

జాతీయరహదారి నుంచి రూ.164కోట్లతో సీసీరోడ్డు

నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల జాతీయరహదారి నుంచి పవర్‌ప్లాంట్ వరకు 11.600 కిలోమీటర్ల నాలుగు లేన్ల సీసీరోడ్డును నిర్మించేందుకు రూ.164కోట్లు మంజూరు చేశారు. దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం గ్రామాల సమీపంలో బైపాస్ రోడ్డు నిర్మించడం ద్వారా పవర్‌ప్లాంట్‌ను జాతీయరహదారికి అనుసంధానం కానుంది. ఈ రహదారిని నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు.

ఈ రోడ్డు నిర్మాణానికి 33 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సిందిగా రెవెన్యూశాఖకు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పవర్‌ప్లాంట్‌లో అంతర్గతంగా, టౌన్‌షిప్‌ల వద్ద రోడ్ల నిర్మాణాలకు మరో రూ.196కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులన్నింటినీ రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తిచేయాల్సి ఉంది.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

● ఎమ్మెల్యే మందుల సామేలు



భిక్షమయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సామేలు

శాలిగౌరారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడైనా రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలో మాజీ సర్పంచ్ స్వర్గీయ వజ్జే భిక్షమయ్య విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలందరూ సమష్టిగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. పార్టీలో కష్టపడిన వారికి మాత్రమే గుర్తింపు ఉంటుందని, వారికే పదవులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ ఛైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ నరిగె నర్సింహ, షేక్ ఇంతియాజ్‌అహ్మద్, చింత ధనుంజయ్, కట్టంగూరి సురేందర్‌రెడ్డి, గోదల నరేందర్ రెడ్డి, తీరుపారి మల్లేష్, విగ్రహదాత సమన్వయకర్తలు తీరుపారి రామ్మూర్తి, రావుల సైదులు, రొండి చంద్రయ్య, తీరుపారి వెంకన్న, జాల శంకరయ్య, ప్రసాద్, నాయకులు చెరుకు జానయ్య, పోల్దాస్ నరేష్, వేముల గోపినాథ్, గణేష్, బోడ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని మోటివేషనల్ స్పీకర్ గూడూరు అంజిరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఆదర్శ, ఇంపాక్ట్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన యువ వికాసంలో ఆయన మాట్లాడారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని, అప్పుడే ఎంతటి సుదూర లక్ష్యాన్ని అయినా మనం చేరుకోవచ్చని, ఆదర్శమైన వ్యక్తులెందరో నిరూపించారని గుర్తుచేశారు. సమావేశంలో హెచ్‌ఎం కూకుట్ల నర్సింహ, లయన్స్ క్లబ్ సభ్యులు పెండ్యాల రమేష్, నాలం వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, విప్లవ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


చండూరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు బరిగెల వెంకయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం మండల పరిదిలోని కొండాపురం గ్రామంలో బరిగెల వెంకయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారకస్థూపాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వెంకయ్య కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత గల కార్యకర్త అని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకుడు ఉజ్జిని రత్నాకర్‌రావు మాట్లాడుతూ పేదల హక్కుల కోసం, కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కోసం నిరంతరం పోరాటం చేశారని కొనియాడారు. గ్రామ కార్యదర్శి గడ్డం నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్‌కుమార్, నాయకులు తిప్పర్తి రాములు, పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, బరిగెల వెంకటేష్, సంజీవ, వెంకన్న, వెంకటేశం, ఊషయ్య, పరమేష్, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకారం అభినందనీయం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న స్వర్ణకార సంఘ నాయకులు

రామగిరి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కందిమల్లయాపల్లి బ్రహ్మంగారి మఠంలో గల ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణానికి విశ్వబ్రాహ్మణ సోదరులు సహకరించడం అభినందనీయమని ఈశ్వరీదేవి పీఠాధిపతులు వీరశివకుమార్ అన్నారు. బ్రహ్మంగారి మఠం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో శనివారం పీఠాధిపతులను నల్లగొండ విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కలిసి స్వాగతం పలికారు. అనంతరం వసతిగృహంలో ఈశ్వరిదేవి ఆలయ నిర్మాణ ఖర్చులు వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్వర్ణకార సంఘ నాయకులు కూరెల్ల మదనాచారి, గోట్టిముక్కల చంద్రశేఖర్, కొల్లోజు సత్యనారాయణచార్యులు రూ. 1,01,116 చొప్పున ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పీఠాధిపతులు శివకుమార్ మాట్లాడుతూ ఆరు కోట్ల వ్యయంతో నిర్మించపడే ఈ దేవాలయానికి సహకరించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు రాచకొండ గిరి, కోశాధికారి కటికం రమేష్, వసతిగృహ నిర్వహణ అధ్యక్షుడు కూరెళ్ల రమణాచారి, నాయకులు కన్నెకంటి సత్యనారాయణ చారి, కాసోజు శంకరాచారి, రాగిఫణి విష్ణుమూర్తి, చొల్లేటి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.20 (298.0120)	1,98,913	1,98,913
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.93 (3.92)	389.29	652.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.783 (40.913)	1,47,362	1,35,023

చికెన్ ధరలు	లైవ్ : రూ.130	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.230



యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పాదన యూనిట్లతో పాటు ఇతర మౌలిక వనరుల కల్పనకు జెన్‌కో లక్ష్యాలను నిర్దేశించుకొని పనుల్లో వేగం పెంచింది. ఈ నెల 2న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ పనుల పురోగతిని సమీక్షించారు. బొగ్గు రవాణాకు అవసరమైన రైల్వే లైన్లు, రోడ్లు, టౌన్‌షిప్ నిర్మాణంతో పాటు, కీలకమైన ఫ్లైయాష్ విక్రయం, రవాణాకు అవసరమైన పనులన్నింటికీ గడువు విధించారు. 2027 నవంబరు నాటికి ఈ పనులన్నింటినీ వందశాతం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు జెన్‌కో డైరెక్టర్ హరీష్ తెలిపారు.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

శరవేగంగా పనులు

- ధర్మల్ పవర్ ప్లాంట్‌లో మౌలిక వసతుల కల్పన
- నవంబరు నెలాఖరుకు రైల్వే పనులు పూర్తికి చర్యలు
- ఫ్లైయాష్ విక్రయంపై స్పష్టమైన కార్యాచరణ
- ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ 2027 నాటికి అందుబాటులోకి..
- జాతీయ రహదారి నుంచి ప్లాంట్‌కు ఫోర్‌వే నిర్మాణం

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కీలకమైన రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు కూడా ప్లాంట్ పనులకు సమాంతరంగా కొనసాగుతున్నాయి. థర్మల్ ప్లాంట్‌కు ఏడాదికి 12.29 మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరం. సగటున నెలకు ఒక మిలియన్ యూనిట్ల బొగ్గు రవాణా చేయాల్సి ఉంటుంది. అందుకోసం ప్లాంటు వద్దకు విష్ణుపురం నుంచి ప్రత్యేకంగా రైల్వే లైన్ ఏర్పాటుచేశారు. ప్లాంట్ వద్ద మార్షలింగ్‌యార్డు, ఎక్స్ఛేంజ్‌యార్డుల్లో కొన్ని పనులు పూర్తవగా, మరికొన్ని చివరిదశలో ఉన్నాయి. ప్లాంట్‌లో నిర్మాణం చేపట్టిన రైల్వే యార్డుల పనులు, వాటికి అనుసంధానంగా ఉండే సిగ్నల్ అండ్ టెలీకమ్యూనికేషన్స్ పనులను, మార్షలింగ్‌యార్డ్‌లో మిగిలిన ఆరులేన్ల పనులతో పాటు, ఎక్స్ఛేంజ్ యార్డులో లేన్ల పనులు, సిగ్నలింగ్ విభాగంలో రెండో దశ కింద చేపట్టిన పనులన్నింటినీ ఈ ఏడాది నవంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రులు, ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లకు మార్గనిర్దేశం చేశారు. వీటితోపాటు కీలకమైన విష్ణుపురం జంక్షన్-వైటీపీఎస్ మార్గంలోని వైలైన్ రైల్వే పనులు దాదాపు పూర్తయ్యాయి. దీనికి సంబంధించి రెండు వంతెనల వద్ద వింగ్‌వాల్స్, కేబుల్స్ షిఫ్టింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ షిఫ్టింగ్ నిమిత్తం నిధులు సైతం రైల్వేశాఖకు జెన్‌కో డిపాజిట్ చేయగా, ఆ పనులను దక్షిణమధ్య రైల్వే పూర్తిచేయాల్సి ఉంది. ఇవి పూర్తయితే వై-లైన్ అందుబాటులోకి వస్తుంది. ఈ వైలైన్‌కు రైల్వేశాఖ అనుమతి ఇస్తే పవర్‌ప్లాంట్‌కు సంబంధించిన రైల్వే పనులన్నీ పూర్తయినట్లే. దీనిపై జెన్‌కో ఉన్నతాధికారులు త్వరలో రైల్వే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, పనుల పూర్తికి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.

ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ 2027కు సిద్ధం

పవర్‌ప్లాంట్ మారుమూల ప్రాంతంలో ఉండటంతో ఇక్కడ పనిచేసే ఇంజనీర్లు, అధికారులు, సిబ్బందికి చక్కటి ఆహ్లాదకర వాతావరణంలో నివాస సముదాయాలు, ఇతర మౌలిక వసతులు కల్పించే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి భారమైనప్పటికీ రూ.971.98కోట్లతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ మంజూరు చేసి పనులు ప్రారంభించామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం సమీక్షలో పేర్కొన్నారు. 67 ఎకరాల ప్రాంగణంలో నిర్మిస్తున్న ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను 2027 నవంబరు నాటికి అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ టౌన్‌షిప్‌లో రెసిడెన్షియల్ విభాగంలో 2,078 క్వార్టర్ల కోసం ఐదు అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. నాన్ రెసిడెన్షియల్ విభాగంలో ఆస్పత్రి, పాఠశాల, స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్లబ్ హౌస్, సూపర్‌మార్కెట్, కమ్యూనిటీ హాల్ తదితర నిర్మాణాలు చేపడతారు. టౌన్‌షిప్ పనులకు డిప్యూటీ సీఎం శుక్రవారం భూమి పూజ చేశారు. ఏ-కాలనీలో రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణాలకు సంబంధించి టెండర్లు ఖరారు చేసి పనులు ఇప్పటికే ప్రారంభించగా, బీ-కాలనీ పనులు ప్రారంభించనున్నారు. బీ-కాలనీకి...

- మిగతా 8వ పేజీలో...



టౌన్‌షిప్‌నకు భూమి పూజలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క (ఫైల్)

పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం

స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యాల వారీగా ఖాళీల ప్రదర్శన

జిల్లాలో పదోన్నతులతో భర్తీ కానున్న 229 పోస్టులు



నల్లగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారంగా స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్ల పదోన్నతుల్లో భాగంగా శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లల్లో అర్హులైన టీచర్ల సర్వీస్ బుక్‌లను, సర్టిఫికెట్లను పరిశీలించారు. వివిధ కౌంటర్లల్లో స్థానిక సంస్థలు, ప్రభుత్వ యాజమాన్యాల వారీగా ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. సబ్జెక్టుల వారీగా సీనియారిటీల జాబితాను నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. అభ్యంతరాలు ఉన్నవారి నుంచి దరఖాస్తులు తీసుకొని సందేహాలను నివృత్తి చేశారు. ఈనెల 4న స్థానిక సంస్థల యాజమాన్య పరిధిలోని ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. మ్యాథ్స్, ఇంగ్లీష్, బయోసైన్స్ సోషల్, పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు అర్హత కలిగిన ఉపాధ్యాయుల పరిశీలనకు ఇప్పటికే జిల్లా విద్యాశాఖ సమాచారం అందింది. జిల్లాలో మొత్తం 229 పోస్టులు పదోన్నతులతో భర్తీకానున్నాయి. ఎస్‌ఏ మ్యాథ్స్ 11 పోస్టులు, ఎస్‌ఏ ఫిజికల్ సైన్స్ 11 (తెలుగు మీడియం), ఇంగ్లీష్ మీడియంలో ఒక పోస్టు, ఎస్‌ఏ బయోసైన్స్ 29, ఎస్‌ఏ సోషల్ 30, ఎస్‌ఏ ఇంగ్లీష్ 17, ఎస్‌ఏ తెలుగు 25, ఎస్‌ఏ హిందీ 21, ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ 7, ఎస్‌ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ 13, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం 40, ఉర్దూ మీడియంలో ఒక పోస్టు భర్తీ చేయనున్నారు. అలాగే ఎస్‌ఏ ఉర్దూ మీడియం ఒకటి, ప్రభుత్వ యజమాన్యంలో ఎస్‌ఏ మ్యాథ్స్ ఒకటి, ఉర్దూ మీడియంలో ఒకటి, ఎస్‌ఏ బయోసైన్స్ రెండు, ఎస్‌ఏ సోషల్, ఎస్‌ఏ సోషల్ (ఉర్దూ మీడియం)లో ఒక పోస్టు చొప్పున, ఎస్‌ఏ ఇంగ్లీష్ రెండు, ఎస్‌ఏ తెలుగు ఆరు, ఎస్‌ఏ హిందీ ఐదు, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం పోస్టులు మూడింటిని పదోన్నతులతో భర్తీ చేయనున్నారు. ఒక్కో పోస్టుకు 1:3 ప్రకారంగా ఉపాధ్యాయుల తాత్కలిక సీనియారిటీ జాబితాను రూపొందించి సర్వీస్ బుక్‌ను, అర్హత సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అనంతరం అర్హులైన వారితో పదోన్నతుల జాబితాను విడుదల చేస్తారు. స్కూల్ అసిస్టెంట్‌లకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించేందుకు స్థానిక సంస్థల యాజమాన్యం పరిధిలోని 47 పోస్టులకు 1:3 ప్రకారంగా ఉపాధ్యాయుల తాత్కాలిక జాబితాను రూపొందించి సర్టిఫికెట్లను పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తిచేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, హాలియా మునిసిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. నాగార్జునసాగర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 3,462 మందిని లబ్ధిదారులుగా ఎంపిక చేశామన్నారు. అందులో 538 ఇళ్లు పునాది స్థాయిలో, 18 స్లాబ్ లెవల్, ఆరు స్లాబ్ వరకు నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణంలో సరైన పురోగతి లేనందున వాటిని వెంటనే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో 136 మంది లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకునే స్థోమత లేనివారిగా గుర్తించామని, వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలు ఇప్పించాలని ఏపీఎంలను ఆదేశించారు. ఈనెల 10లోపు ఇళ్ల నిర్మాణాల్లో 50శాతం పురోగతి సాధించాలన్నారు. వివిధ స్థాయిల్లో నిర్మాణాలు పూర్తిచేసిన వారికి ప్రతీ సోమవారం బిల్లులు చెల్లించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీ బాలికల విద్యాలయాన్ని తనిఖీచేసి విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలో వంటగది, స్టోర్‌రూమ్, పాఠశాల పరిసరాలను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేసి ఓపీ రిజిస్టర్, ఏఎన్‌సీ, మందుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆమె వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పెద్దవూర ఎంపీడీవో ఉమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, తదితరులు ఉన్నారు.

ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ చూపాలి

సర్వశిక్ష అభియాన్ అదనపు డైరెక్టర్ సోమిరెడ్డి



పాఠశాల పరిసరాలను ఉపాధ్యాయులతో కలిసి పరిశీలిస్తున్న సోమిరెడ్డి

వేములపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అడ్మిషన్ పొందిన ప్రతీ విద్యార్థి ప్రగతిపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సర్వశిక్ష అభియాన్ అదనపు డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆమనగల్లు ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను, పాఠశాల పరిసరాలను పరిశీలించి మాట్లాడారు. విద్యలో సాంకేతికతను జోడిస్తూ బోధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోని ఉత్తమ ఫలితాలు రాబట్టాలని సూచించారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వ మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణం లో వండాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు బి.యోగేశ్వర్, ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

నాలుగు లక్షల ఇళ్లలో జ్వర

సర్వే నిర్వహిస్తాం

డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మర్రిగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4.25లక్షల ఇళ్లలో జ్వర సర్వే నిర్వహిస్తామని, డెంగీ, మలేరియా ప్రబలకుండా వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి (కమ్యూనిటీ హెల్త్ సెంటర్), ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా దామర భీమనపల్లి ఉపకేంద్రం పరిధిలోని వట్టిపల్లి గ్రామంలో నిర్వహించిన యూఐపీ సెషన్ సైట్‌ను సందర్శించి స్టోర్లను పరిశీలించారు. గర్భిణులకు ప్రసవ అనంతరం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి, అంగన్వాడీ కేంద్రంలో టీకాలు తీసుకున్న పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. డయాలసిస్ సెంటర్‌ను, వందరోజుల టీబీ ముక్త్ అభియాన్ పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 4.25లక్షల గృహాల్లో జ్వర సర్వే నిర్వహించడం లక్ష్యమన్నారు. ఇప్పటికే సిబ్బంది సర్వేను ప్రారంభించారని తెలిపారు. సిబ్బంది ఇంటింటికీ తిరి జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లో వ్యక్తిగత, సామాజిక పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో కే.రవి, వైద్యాధికారి శంకర్‌నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ శాలిని, డాక్టర్ దీపక్ ఉన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండరూరల్, ఆగస్టు 2 (ఆం ధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం దొడ్డి కొమరయ్య భవనంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, అందరికి కనీస వేతనాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక ఏ హామీని నెరవేర్చలేదన్నారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాలను తక్కువగా సవరించి 1.20కోట్ల మం ది కార్మికులకు ద్రోహం చేశారని విమర్శించారు. కార్మికుల సమస్యల పై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు ఈ నెల 3 నుంచి 28వ తేదీ వరకు సర్వే నిర్వహిస్తామన్నారు. 29న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, నాయకులు డబ్బికార్ మల్లేష్, ఎండి.సలీం, సైదయ్య, ప్రమీల, దండంపల్లి సత్తయ్య, వెంకటయ్య, గౌతంరెడ్డి, పాల్గొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు దూరంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలించాలని, బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని కోరుతూ డీవైఎఫ్ఐ చేపట్టిన యువచైతన్య సైకిల్ యాత్ర శనివారం మిర్యాలగూడలో ముగిసింది. ముగింపు సభలో డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పాల్గొని మాట్లాడారు. సరదా కోసం, చెడు స్నేహాల వల్ల మత్తుకు అలవాటు పడి ఉన్నత భవిష్యత్‌కు యువత దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడితే తాము ఏం చేస్తున్నామో తెలియని స్థితికి వెళ్లి ఎలాంటి దుర్మార్గాలకైనా వెనుకాడక వారితో కుటుంబాన్ని, సమాజాన్ని పెడమార్గంలోకి తీసుపోతారన్నారు. దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డీఎస్పీ రాజశేఖర్‌రాజు మాట్లాడుతూ బెట్టింగ్ యాప్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ ముప్వారామారావు, సామాజికవేత్త మునీర్, సీపీఎం జిల్లా నాయకులు వినోద్ నాయక్, కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు రెమిడాల పరుశరాములు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లం మహేశ్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, డీవైఎఫ్ఐ నాయకులు పతాని శ్రీనివాస్, పల్లా భిక్షం, వదూద్, శ్రీనునాయక్, ఆశీర్వాదం పాల్గొన్నారు.

ముగిసిన యువ చైతన్య సైకిల్ యాత్ర

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్ యాత్ర శనివారం ముగిసింది. డ్రగ్స్‌ను అరికట్టాలని, బెట్టింగ్ వ్యాపారాలను నిషేధించాలని జిల్లాలో చేపట్టిన సైకిల్ యాత్ర విజయవంతంగా ముగిసింది. గత నెల 24న నకిరేకల్ నుంచి ప్రారంభమైన యాత్ర ఆరు మున్సిపాలిటీలు, 25 మండలాల్లోని అనేక గ్రామాల్లో యాత్ర కొనసాగింది. సుమారు 450 కిలోమీటర్లు యాత్ర నిర్వహించారు. సైకిల్ యాత్రలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్ల మహేశ్, పుల్లెంల శ్రీకర్, మహేశ్, గుండాల నరేశ్, కట్టలింగస్వామి, గద్దపాటి సుధాకర్, శశిధర్, బొడ్డుపల్లి నరేశ్, రాజేష్, సాయితేజలు పాల్గొన్నారు.

శ్రీలత కుటుంబానికి న్యాయ సాయం అందిస్తా

సీనియర్ న్యాయవాది దర్శనం నర్సింహ



శ్రీలత చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న న్యాయవాది నర్సింహ

కనగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలో ఇటీవల ప్రేమికుడి చేతిలో హత్యకు గురైన కనగల్ మండలం దోరెపల్లి గ్రామానికి చెందిన దళిత యువతి,నర్సు సిరిపంగి శ్రీలత కుటుంబానికి ఉచితంగా న్యాయ సాయం అందిస్తానని సీనియర్ న్యాయవాది దర్శనం నర్సింహ తెలిపారు. శనివారం శ్రీలత తల్లిదండ్రులైన కాశయ్య, రేణుకలను మండలంలోని దోరెపల్లి గ్రామంలో కలిసి పరామర్శించారు. శ్రీలత చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ దళితుల మీద జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను ప్రతీఒక్కరు ఖండించాలన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు,ఆర్‌ఎంపీ వైద్యుడు చిత్రం స్వామి, దళిత సంఘాల నాయకులు శంకర్, వంశీ, వినోద్, సుధాకర్, రమేష్ తదితరులున్నారు.

కల్లుగీత కార్మికులకు 'రక్షణ'

- ప్రమాదాలు నుంచి రక్షించేందుకు కాటమయ్య రక్షణ సామగ్రి
- సామగ్రితో తగ్గిన ప్రమాదాలు

6

నార్కట్‌పల్లి పెద్దచెర్వుకు మహర్దశ

వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే చర్యలు

దేవరకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే చర్యలు చేపడుతామని దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ అన్నారు.దేవరకొండ పట్టణంలోని 753 సర్వేనంబర్ వక్ఫ్‌బోర్డు భూముల్లో అక్రమ కట్టడాలు శుక్రవారం కూల్చివేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ వక్ఫ్‌బోర్డు భూములను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కూల్చివేతల్లో రెవెన్యూ, వక్ఫ్‌బోర్డు, పోలీసులు మునిసిపల్ అధికారులు పాల్గొన్నట్లు చెప్పారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఉండాలి

కొండమల్లేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ సేవలపై అవగాహన కలిగి ఉండాలని టీజీబీ ఏజీఎం, రీజనల్ మేనేజర్ విజయ్ భాస్కర్‌గౌడ్ అన్నారు. మండలంలోని దేవరోనితండాలో శనివారం నిర్వహించిన ఆర్థిక అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ బిజినెస్ దేవేందర్, బ్రాంచి మేనేజర్ చంద్రశేఖర్, నోడల్ ఆఫీసర్ రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్స్ శ్రీహర్ష, అభిలాష్, బ్యాంక్ సిబ్బంది సతీష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు స్టాపర్లు

నిత్యం రద్దీగా ఉండే మిర్యాలగూడ పట్టణంలోని సాగర్‌రోడ్‌లో ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మార్గంలో రద్దీ ఎక్కువగా ఉండగా, రహదారి ఇరుకుగా ఉంటుంది. ఇక అడ్డంగా ఆగే ఆటోలతో మరింత ట్రాఫిక్ జామ్ అవుతోందని, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ఆటోలు ఆపేందుకు ప్రధాన కూడళ్లలో స్టాపర్లు ఏర్పాటు చేశారు. నిబంధనలు పాటించి, సహకరించాలని పోలీసులు కోరుతున్నారు. - (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)



బస్టాండ్ ఎదురుగా సాగర్‌రోడ్‌పై అమర్చిన ప్లాస్టిక్ స్టాపర్లు

గురుకులంలో నీటి సమస్య..

మిర్యాలగూడ పట్టణంలోని జ్యోతిరావు పూలె సాంఘిక సంక్షేమ బీసీ గురుకుల పాఠశాలలో నీటి సమస్య వేధిస్తోంది. ఈ అద్దె భవనంలో బోరు ఎండిపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. 5 నుంచి పదో తరగతుల వరకూ బోధన సాగుతున్న ఈ విద్యాలయాన్ని ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేశారు. ఇప్పటికే 400 మంది విద్యార్థులతో ఉన్న ఈ భవనం సరిపోకపోవడంతో ఇంటర్ తరగతులను జిల్లా కేంద్రానికి సమీపంలో నిర్వహిస్తున్నారు. సమస్యను ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, నూతన భవనం కోసం అన్వేషిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, మిర్యాలగూడ టౌన్



జ్యోతీరావు పూలె సాంఘిక సంక్షేమ బీసీ గురుకుల పాఠశాల

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

రాపోలు పరమేశ్, బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు



ఇంటర్వ్యూ Interview

పాఠశాలలు ప్రారంభమై 45 రోజులు గడిచినప్పటికీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడం లో ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులకు రావాల్సిన బెనిఫిట్స్ రెండేళ్లుగా మంజూరు కావడం లేదని, సమస్యలు పరిష్కరించాలని బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. (ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ)

ఆంధ్రజ్యోతి : ఉపాధ్యాయుల బెనిఫిట్స్ అందుతున్నాయా?

పరమేశ్: 2023 నుంచి విశ్రాంత ఉపాధ్యాయులకు అందాల్సిన బెనిఫిట్స్, జీపీఎఫ్ డబ్బులు రావడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇవి తప్పించుకునేందుకే సర్వీసు కాలాన్ని 58 నుంచి 61 ఏళ్లకు పెంచారన్నది అందరిలోనూ ఉంది. ప్రభుత్వ ఇన్సూరెన్స్ మెచ్యూరిటీ కూడా విడుదల చేయడం లేదు. మెడికల్, సరెండర్ లీవ్స్ బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నెలకు రూ.700 కోట్లు రిలీజ్‌చేసి క్లియర్ చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. అయినప్పటికీ ఇప్పటి వర కు నెరవేర్చలేదు. 5 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. 23 నుంచి పిఆర్సీ రావాల్సి వుంది.

ఆంధ్రజ్యోతి: సబ్జెక్ట్ టీచర్ల నియమాకాలు పూర్తయ్యాయా?

పరమేశ్: జిల్లాలో 229 హైస్కూల్స్, 1,129 ప్రాథమిక పాఠశాలలు 17 మోడల్ స్కూల్స్, 27 కసూర్బా పాఠశాలలున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో ఇంకా అడ్మిషన్లు కొనసాగుతున్నాయి.సబ్జెక్ టీచర్ల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రమోషన్ల చేపట్టడం వచ్చే శనివారం లోగా పోస్టింగ్‌లు ఇచ్చే ప్రక్రియ పూర్తయితే ఖాళీలు నిండుతాయి ఆ తరువాతే ఖాళీల సంఖ్య తేలుతుంది.

ఆంధ్రజ్యోతి:విద్యాబోధనలో ఏవైనా సమస్యలు ఉన్నాయా?

పరమేశ్: గతేడాది డేటా ఆధారంగా ప్రభుత్వం పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ చేసింది. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే రాయితీలు, ఉపాధ్యాయుల కృషి, పెరిగిన ఉత్తీర్ణత శాతం, ఇంగ్లిష్ మీడియంలో బోధన తదితర కారణాలతో ఈ ఏడు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో బుక్స్ అందరికీ అందకపోవడంతో బోధన కొంత ఇబ్బందిగా మారుతోంది. అన్ని హైస్కూళ్లలో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించే ఏర్పాట్లు చేయాలి.

ఆంధ్రజ్యోతి: నగదు రహిత వైద్యం అందుబాటులోకి వచ్చిందా?

పరమేశ్: ఉద్యోగులకు ప్రతి నెల జీతంలో రూ. 500 కోత విధించి హెల్త్‌కార్డ్స్‌తో నగదు రహిత వైద్యం అందిస్తామన్నారు. నేటి వరకు అమలు చేయలేదు. ఉమ్మడి జిల్లాలో ఒకే వెల్‌నెస్ సెంటర్‌లో ఉచితంగా మందులు ఇస్తున్నప్పటికీ అన్నిరకాల మందులు అందుబాటులో ఉండటం లేదు. జిల్లాకో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా గౌతమి



కొర్రగౌతమి రాంసింగ్

దేవరకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా దేవరకొండ మండలం మైనంపల్లి మాజీ ఎంపీటీసీ కొర్రగౌతమి రాంసింగ్‌ను నియమిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి కలీద్ అహ్మద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొర్ర గౌతమి మైనంపల్లి ఎంపీటీసీగా కొనసాగుతూ యువజన కాంగ్రెస్ నిర్వహించిన ఇందిరఫెలో శక్తి అభియాన్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. పార్టీకి తాను చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శిగా నియమించినందుకు గౌతమి రాంసింగ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి కలీద్ అహ్మద్, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

అసైన్డ్ భూమి పట్టాదారులపై అధికారుల నిర్బంధం ఆపాలి

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూమి పట్టా కలిగిన సాగుదారులపై అటవీ అధికారుల నిర్బంధం అపాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ అన్నారు. గుడిపల్లి మండలం ఘట్ నెమలిపురం గ్రామంలో శుక్రవారం రాత్రి అసైన్డ్ భూమి పట్టా కలిగిన సాగుదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1983వ సంవత్సరంలో ఎస్సీ కులం, ఇతర పేదలు మొత్తం 22 మంది ప్రభుత్వ భూమి అసైన్డ్ చేసి పట్టాలు పొందారు. సాగు చేస్తున్న వారిపై అటవీ అధికారులు ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తూ సాగు చేయకుండా ఆటకం కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, అటవీ అధికారులు సంయుక్తంగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాలన్నారు. అటవీ అధికారుల నిర్బంధం అవకపోతే ఇతర ప్రజా సంఘాలతో కలిసి భూములు సాధించుకునే వరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కావలి కృష్ణయ్య, సాగుదారుల కమిటీ సభ్యులు బురి ఆంజనేయులు, రామలింగం,చంద్రమౌళి, వెంకన్న ముత్యాలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కంబాలపల్లి ఆనంద్

పేదల సంక్షేమానికి పాటు పడుతున్నాం

● ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా తాము పాటుపడుతున్నట్లు ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండలానికి మంజూరైన 1,557 రేషన్‌కార్డులను అర్హులైన లబ్ధిదారులకు అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌తో కలిసి అందజేశారు ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలనుద్ధేశించి ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమం పేరుతో ఓట్లను, అభివృద్ధి పేరుతో అవినీతి ద్వారా డబ్బులు దండుకోవడానికే ప్రయత్నించారే తప్ప వారు చేసిందేమి లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే విధంగా కృషి చేస్తుందన్నారు.రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ పైలట్ ప్రాజెక్టు ద్వారా అర్హులైన ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా 4వేల ఎకరాలకు అసైన్డ్‌మెంట్ పట్టాలు అందిస్తామన్నారు. అలాగే ఆ సభలోనే ఫారెస్ట్ భూములను సేద్యం చేసుకుంటున్న అర్హులైన రైతులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలతోపాటు సాగర్ గృహ నిర్వాసితులకు సంబంధించి ఇచ్చిన హామీ కూడా నిలబెట్టుకుంటామన్నారు. మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేలా స్థల సేకరణకు అనుమతులు తీసుకొచ్చేందుకు సంబంధిత మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ద్వారా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే ప్రభుత్వ కార్యాలయాలయ సముదాయ పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అన్ని సర్పంచ్,ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునే విధంగా ప్రజలు తమకు మద్దతుగా నిలవాలని కోరారు. తహసీల్దార్ అనిల్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీఎస్‌వో వెంకటేష్, సివిల్ సప్లయ్ డీఎం హరీష్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలియా, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, అంకతి సత్యం, సీనియర్ నాయకులు యడవెల్లి వల్లభరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ గడ్డం సాగర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు చవ్వా బ్రహ్మానందరెడ్డి, అంగోతు భగవాన్‌నాయక్, నాయకులు రమావత్ కృష్ణనాయక్, శాగం రాఘవరెడ్డి, ఆంగోతు పాండునాయక్, పెంకీస్ పాపిరెడ్డి పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, రేషన్ కార్డు లబ్ధిదారులు

యూరియా, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి : ఏడీఏ

హాలియా,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): యూరియా, ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని ఏడీఏ సరిత తెలిపారు. శనివారం అనుముల మండలం కొత్తపల్లి రైతు వేదికలో హాలియా వ్యవసాయ డివిజన్‌లోని ఆరు మండలాల ఎరువుల డీలర్లకు డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లు ఎరువులు, పురుగుమందులు, విత్తనాల వ్యాపారంలో పాటించాల్సిన నిబంధనలను డీలర్లకు వివరించారు. ఈ పాస్ పద్ధతిలో మాత్రమే అమ్మకాలను జరపాలని, ఎరువులతో పాటు ఇతర ప్రొడక్ట్‌లను రైతులకు బలవంతంగా ఇవ్వకూడదన్నారు. కార్యక్రమంలో ఆరు మండలాల వ్యవసాయాధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

● **వేములపల్లి :** పీఏసీఎస్ కేంద్రాలకు వచ్చే రైతులకు యూరియా కొరత లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ హేమలత అన్నారు. మండలంలోని వేములపల్లి, శెట్టిపాలెం పీఏసీఎస్ కేంద్రాలను ఏవో కిశోర్‌నాయక్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదామ్‌లోని యూరియా నిల్వలను పరిశీలించి స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పీఏసీఎస్ కేంద్రాలకు కేటాయించిన యూరియా నిల్వలను సొసైటీ పరిధిలోని రైతులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, సీఈవో రవీందర్‌రావు, సైదులు, జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు.

● దామరచర్ల : ఎరువుల దుకాణాదారులు ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని తహసీల్దార్ జవహర్‌లాల్ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో పలు ఎరువుల దుకాణాలన సందర్శించి స్టాక్ రిజిస్టర్‌ను, ఎరువుల నిల్వలను పరిశీలించి మాట్లాడారు. ఎరువులను ఈ-పాస్ మిషన్ ద్వారానే విక్రయించాలని, ఎరువులు పక్కదారి పట్టినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో రుషేంద్రమణి, ఏఈవో సైదులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ అర్బన్ : ప్రైవేటు డీలర్లు, ఫర్టిలైజర్స్ షాపుల నిర్వాహకులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సురేష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఇన్‌చార్జి ఏడీఏ సైదానాయక్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాలకు సంబంధించిన స్టాక్ రికార్డులు, బిల్లు బుక్‌లను పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా స్థాయిలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు ఈ పాస్ మిషన్లలో రైతుల ఆధార్ వివరాలను నమోదు చేసి ఎరువు అమ్మకాలు సాగించాలన్నారు. వ్యాపారులు నిబంధనలను అతిక్రమించి అధిక ధరకు యూరియా, ఇతర ఎరువులను విక్రయిస్తే రైతులు తమ ప్రాంతంలోని వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.



హాలియా : డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

బిగ్ హెల్ప్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

నాగార్జునసాగర్,ఆగస్టు2(ఆంధ్రజ్యోతి): సాగర్ హిల్‌కాలనీ, పైలాన్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. పైలాన్ మోడల్ హైస్కూల్‌లో బ్రహ్మానాయక్‌కు రూ .3 వేలు, గీతాంజలికి రూ.2 వేల నగదు బహుమతులను అందజేశారు. ఈ నగదు బహుమతులను మాటూరి వెంకట రమణారావు జ్ఞాపకార్థం అందించామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శేషు, బిగ్ హెల్ప్ సభ్యులు రాజబాబు, అంజయ్య, చాంద్ పాషా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతుల ప్రదానోత్సవంలో హెచ్‌ఎం శేషు, సభ్యులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

దేవరకొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కంభంపాటి శంకర్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జూలై 30 నుంచి ఈనెల 6వరకు నల్లగొండ జిల్లాలో చేపట్టిన సైకిల్‌యాత్ర శనివారం దేవరకొండకు చేరుకుంది. దేవరకొండ బస్టాండ్‌లో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం ఎదుట సైకిల్‌యాత్రను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 8,158 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించకపోవడంతో విద్యార్థులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆకారపు నరేష్, దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగె వెంకటేష్, సైదానాయక్, స్పందన, రవీందర్, రాకేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్

శరవేగంగా పనులు

(5వ పేజీ తరువాయి)

సంబంధించి భూమి చదునుచేసే పనులు కొనసాగుతున్నాయి.

జెన్‌కో అధికారులు పేర్కొంటున్నారు. ఫ్లైయాష్‌ను 12 గంటల పాటు నిల్వ ఉంచేందుకు 2,550 మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో ప్లాంట్‌లోనే నాలుగు ఫ్లైయాష్ పాండ్లు నిర్మిస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తయ్యే ఫ్లైయాష్‌ను స్థానికంగా ఉన్న సిమెంట్ కంపెనీలు తీసుకోవడానికి ఆసక్తి కనబరుస్తున్నాయి. జాతీయస్థాయి సిమెంట్ కంపెనీలైన ఆదానీ, ఆల్ట్రాటెక్, శ్రీసిమెంట్, అల్ట్రాసిమెంట్ కంపెనీలు సైతం వ్యాగన్ ద్వారా దీర్ఘకాలికంగా సరఫరాచేస్తే తీసుకునేందుకు ఆసక్తికనబరుస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం మార్కెట్ ప్రకారం ఇక్కడ ఉత్పత్తయ్యే ఫ్లైయాష్‌కు మెట్రిక్‌టన్నుకు రూ.565 ఇష్యూ ప్రైస్ నిర్ధారణ చేశారు. తొమ్మిది కంపెనీలు ఈ ధరకు ప్రతి రోజూ 2వేల మెట్రిక్‌టన్నుల వరకు ఫ్లైయాష్ తీసుకునేందుకు సిద్ధమయ్యాయి. అదేవిధంగా ఫ్లైయాష్‌ను వ్యాగన్ల ద్వారా తరలించేందుకు వీలుగా సమాంతర రైల్వే లైన్ నిర్మాణానికి ఢిల్లీకి చెందిన ఓ సంస్థ డీపీఆర్ సమర్పించింది. వీటన్నింటిపై ప్లాంట్ పూర్తిస్థాయి విద్యుదుత్పాదనకు సిద్ధమయ్యేలోగా ప్రభుత్వం ఉన్నత స్థాయిలో తీసుకునే నిర్ణయం మేరకు జెన్‌కో కార్యాచరణ అమలు చేయనుంది.

జాతీయరహదారి నుంచి రూ.164కోట్లతో సీసీరోడ్డు

నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల జాతీయరహదారి నుంచి పవర్‌ప్లాంట్ వరకు 11.600 కిలోమీటర్ల నాలుగు లేన్ల సీసీరోడ్డును నిర్మించేందుకు రూ.164కోట్లు మంజూరు చేశారు. దామరచర్ల, తాళ్లవీరప్పగూడెం గ్రామాల సమీపంలో బైపాస్ రోడ్డు నిర్మించడం ద్వారా పవర్‌ప్లాంట్‌ను జాతీయరహదారికి అనుసంధానం కానుంది. ఈ రహదారిని నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ రోడ్డు నిర్మాణానికి 33 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సిందిగా రెవెన్యూశాఖకు డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పవర్‌ప్లాంట్‌లోఅంతర్గతంగా, టౌన్‌షిప్‌ల వద్ద రోడ్ల నిర్మాణాలకు మరో రూ.196కోట్లతో పనులు చేపట్టారు. ఈ పనులన్నింటినీ రెండేళ్ల కాలవ్యవధిలో పూర్తిచేయాల్సి ఉంది.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతి ప్రదానోత్సవంలో హిమవంత్‌కుమార్

కొండమల్లేపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల్లో రాణించి ప్రతిభ కనబర్చాలని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ కుమారుడు హిమవంత్‌కుమార్ అన్నారు. శనివారం హిమావంత్‌కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గుమ్మడవెల్లి గ్రా మంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శనివారం నగదు బహుమతిని ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.20,116, ద్వితీయ బహుమతి రూ.15,116, తృతీయ బహుమతి రూ.10,116లను అందజేశారు. కార్యక్రమంలో షేక్‌ఇస్మాయిల్, లాలయ్య, గిరి, జహంంగీర్, శంకర్, చింటూ, మల్లేష్, విష్ణు, కోటేష్, గోవర్దన్, ఉదయ్, ఇలియాస్ పటేల్, హరికృష్ణ, వెంకటేశ్, మున్న పాల్గొన్నారు.

5న మహాధర్నా

చింతపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) పిలుపు మేరకు ఆగస్టు 5న జిల్లా కేంద్రాల్లో 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి మహాధర్నాలను విజయవంతంచేయాలని చింతపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్ఎం రమావత్ లక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సిలివేరు నారాయణ, జిల్లా కమిటీ సభ్యుడు జి.దేవకుమార్, జింకల సత్యనారాయణ; పున్న కృష్ణయ్య, వెంకటేశం, శ్రీరాములు, బి.కృష్ణయ్య, పి.నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలి

దేవరకొండ, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): బిడ్డపుట్టిన గంటలోపే ముర్రుపాలు ఇవ్వాలని దేవరకొండ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, విజయలక్ష్మి అన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని శనివారం దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో తల్లులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి మాట్లాడారు. ముర్రుపాలలో బిడ్డ ఎదగడానికి కావాల్సిన పోషక విలువలు ఉంటాయని, రోగ నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు సత్యకుమారి, బాలమణి, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలవారోత్సవాల్లో అందరూ పాల్గొనాలి

చింతపల్లి : అంగన్‌వాడీ టీచర్లందరూ తల్లిపాలవారోత్సవాల్లో పాల్గొనాలని ఐసీడీఎస్ సీడీపీవో సక్కుబాయితెలిపారు. ఈ నెల 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లిపాలవారోత్సవాలకు సంబంధించిన కార్యచరణ రూపొందించినట్లు ఆమె తెలిపారు. ముర్రుపాలు శిశువుకు తల్లులకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయన్నారు. ఆరోగ్య సర్వే 5 నివేదిక ప్రకారం రాష్ట్రంలో సగటున తల్లిపాలు 67.0 శాతం మంది మాత్రమే శిశువు పుట్టిన గంటలోపు తాగిస్తున్నారన్నారు.

హామీలను నెరవేర్చాలి: ఏఐవైఎఫ్

డిండి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యనమల్ల నవీన్ అన్నారు. మండలంలోని గోనకోల్ గ్రామంలో శనివారం ఏఐవైఎఫ్ జెండాను ఎగురవేసి ఆయన మాట్లాడారు. రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఎంతో మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ రుణాలు మంజూరుకాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యువకులకు రుణాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ గోనకోలు గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నూనె భూపాల్, కార్యదర్శిగా కామేపల్లి శ్రీకాంత్, కోశాధికారిగా కర్ణాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నవీన్ తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి రాగం వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఆర్యేపల్లి మహేష్, సహాయకార్యదర్శి కామేపల్లి లవన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్ కుమార్, కామేపల్లి ప్రవీన్, అరవిందరాజు, శంకర్, వెంకటయ్య పాల్గొన్నారు